క్లుప్తంగా

ఆర్థికసాయం

మద్దూరు(హుస్నాబాద్): ఆపదలో ఉన్నవారికి బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నాగపూరి కిరణ్‌కుమార్ అండగా నిలుస్తూ మనోధైర్యం కల్పిస్తున్నాడు. ఐదురోజులుగా కురుస్తున్న వానలకు మండలంలోని రేబర్తి గ్రామానికి చెందిన కూకట్ల నర్సవ్వ, అందే ఎల్లవ్వల ఇళ్లు కూలిపోయాయి. దీంతో విషయం తెలుసుకున్న నాగపూరి కిరణ్ ఆదివారం బాధిత కుటుంబాల వద్దకు వెళ్లి ఓదార్చి, ఒక్కో కుటుంబానికి రూ.5వేల చొప్పున ఆర్థికసాయం అందజేశారు.

సంస్కృతి, సంప్రదాయాలకు పెద్దపీట

23జీజేడబ్ల్యూ 04 :

బోనాల ఊరేగింపులో ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి తదితరులు

గజ్వేల్: సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. ఆదివారం తన సొంత గ్రామమైన గజ్వేల్ మండలం బూర్గుపల్లిలో నిర్వహించిన బోనాల ఉత్సవాల్లో ఆయన పాల్గొని గ్రామదేవతలకు పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ కృషితో పండగలకు ప్రాధాన్యత లభించిందన్నారు. కాగా గ్రామంలో బోనాల ఊరేగింపు, పోతరాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలు విశేషంగా ఆకట్టుకున్నాయి.

సన్మానం



ఏసీపీని సన్మానిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

దుబ్బాకరూరల్: సిద్దిపేట ఏసీపీగా బాధ్యతలు స్వీకరించిన సురేందర్‌రెడ్డిని బీఆర్ఎస్ నాయకులు శాలువా కప్పి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో అక్బర్‌పేట-భూంపల్లి బీఆర్ఎస్ అధ్యక్షుడు జీడిపల్లి రవి, పీఏసీఎస్ చైర్మన్ కైలాష్, సర్పంచ్ రాజయ్య, ఎల్లారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

జగదేవ్‌పూర్(గజ్వేల్): జగదేవ్‌పూర్ ఎస్ఐ కృష్ణమూర్తి సీఐగా పదోన్నతి పొందడంతో ఆదివారం తిగుల్, పలుగుగడ్డ, ఇటిక్యాల రజక సంఘం నాయకులు కృష్ణమూర్తిని కలిసి శాలువాలు కప్పి సన్మానించి అభినందించారు. మరిన్ని పదవులు పొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నాయకులు అశోక్, ఎల్లారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, భూమయ్య, ఐలయ్య, సీతయ్య, శ్రీనివాస్ ఏల్లేష్, రవి, అయూబ్, రాములు, దాసు, నర్సింలు, బాల్‌నర్సయ్య, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం



స్తంభం ఒరగడంతో నేలవాలిన కరెంట్ వైర్లు

దుబ్బాక: ఇటీవల కురిసిన వర్షాలకు దుబ్బాక నుంచి మల్లాయపల్లికి వెళ్లే మార్గంలో పట్టణానికి చెందిన బద్దిపడిగ ఎల్లారెడ్డి పొలం వద్ద కరెంట్ స్తంభం ఒరిగి కరెంట్ వైర్లు నేలవాలాయి. అది గమనించిన స్థానిక రైతులు విద్యుత్ సరఫరాను నిలిపి వేసి విద్యుత్ అధికారులకు సమాచారం అందించారు. ఘటన జరిగి మూడు రోజులవుతున్నా సంబంధిత అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం పట్ల రైతులు తీవ్ర ఆగ్రహానికి గురవుతున్నారు. పెద్ద ప్రమాదం జరగక ముందే ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

విద్యుత్ షాక్‌తో పాడి గేదెలు మృతి

మిరుదొడ్డి(దుబ్బాక): విద్యుత్ షాక్‌తో పాడి గేదె మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని ధర్మారంలో ఆదివారం జరిగింది. గ్రామానికి చెందిన బాధితుడు గూళ్ళ చంద్రయ్య తెలిపిన వివరాలు.. పాడి గేదె తన వ్యవసాయ పొలం వద్ద ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ దగ్గర గడ్డి మేస్తున్న క్రమంలో విద్యుత్ షాక్ తగిలి మృత్యువాత పడిందని విలపించాడు. సుమారు రూ.70వేల ఆస్తి నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశాడు.

చేర్యాల(సిద్దిపేట): విద్యుత్ షాక్‌కు గురై పాడి గేదె మృతి చెందిన ఘటన మండల పరిధిలోని నాగపురి గ్రామంలో ఆదివారం ఉదయం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గొట్టం చంద్రశేఖర్‌రెడ్డి పాడి గేదె ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందింది. సుమారు రూ.80వేల నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు వాపోయాడు.

ఆహ్లాదకరం.. ప్రకృతి వనం



గండిపల్లి గ్రామ పల్లె ప్రకృతి వనం



ప్రకృతి వనంలో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్

- పచ్చదనంతో కళకళలాడుతున్న పార్కు
- ఊయలలు, ఆట పరికరాలతో ఆకట్టుకుంటున్న వైనం
- సేదతీరుతున్న గ్రామస్తులు

అక్కన్నపేట(హుస్నాబాద్): పర్యావరణ పరిరక్షణకు ప్రభుత్వం చేపట్టిన హరితహారం కార్యక్రమం సత్ఫాలితాలు ఇస్తున్నది. పట్టణాల్లో పార్కుల మాదిరిగా పల్లెల్లోనూ ప్రకృతి వనాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం సంకల్పించి ఊరూరా ఏర్పాటు చేయించింది. కొత్త పంచాయతీరాజ్ చట్టంలో పేర్కొన్నట్లు పంచాయతీలకు కేటాయించిన నిధుల్లో గ్రీన్ బడ్జెట్ కింద ఖర్చు చేసే 10శాతం నిధులను వీటికి ఉపయోగించారు. ఆహ్లాదంగా తీర్చిదిద్దేందుకు పంచాయతీల్లో నిధులు ఖర్చు చేశారు. ఫలితంగా గ్రామాల్లో ప్రకృతి వనాలు పచ్చగా దర్శనమిస్తూ కనువిందు చేస్తున్నాయి. అక్కన్నపేట మండలం గండిపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనం పచ్చదనంతో కళకళలాడుతోంది. పార్కును తలపించే ప్రకృతి వనంలో చిన్నారులు ఆడుకునేలా వస్తువులు, కూర్చునే బెంచీలు, తదితర ఏర్పాట్లు కూడా చేశారు. దీనికి తోడుగా ఓపెన్ జిమ్‌ను సైతం ఏర్పాటు చేశారు. దీంతో ఉదయం, సాయంత్రం సమయాల్లో చిన్నాపెద్ద అనేతేడా లేకుండా ప్రకృతి వనంలో సేద తీరుస్తున్నారు. అదేవిధంగా నాటిన మొక్కలు పెరిగి నీడను ఇస్తున్నాయి. ప్రకృతి వనంలో పూలచెట్లు చూపరులను ఆకర్షిస్తున్నాయి. దాదాపుగా రెండేళ్ల క్రితం నాటిన పూలు, పండ్ల మొక్కలు ఏపుగా పెరిగాయి. పక్షుల కిలకిల రాగాలు, చల్లని గాలులతో ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పడడంతో సేదదీరేందుకు అనువుగా ఉందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

హుస్నాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత



టైర్లలో ఉన్న నీటిని పారబోస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత

హుస్నాబాద్: ఇంటి చుట్టూ ఉన్న పరిసర ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండకుండా శుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత అన్నారు. ఆదివారం పట్టణంలోని 18వ వార్డులో 10 గంటల 10 నిమిషాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజలందరూ తమ ఇంట్లో ఉన్న కూలర్, పాత టైర్లు, పాత బకెట్లలో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నీటి నిల్వతో దోమలు వ్యాపించి మలేరియా, టైఫాయిడ్, డెంగీ జ్వరాలతో అనారోగ్యాలకు గురవుతారన్నారు. వారంలో ప్రతీ ఆదివారం నిల్వ ఉన్న నీటిని పారబోయడంతో దోమలను నియంత్రించవచ్చన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనిత, కౌన్సిలర్ మిర్యాల రమేశ్, మాజీ ఎంపీపీ ఆకుల వెంకట్, కో-ఆప్షన్ సభ్యుడు అయూబ్, ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ శంకర్, ఎన్విరాన్మెంట్ ఇంజినీర్ రవికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆజాద్‌ను ఆదర్శంగా తీసుకోవాలి



సబ్బు బిళ్లపై ఆజాద్ రూపం

గజ్వేల్‌రూరల్: స్వాతంత్య్ర సమరయోధుడు చంద్రశేఖర్ ఆజాద్‌ను ఆదర్శంగా తీసుకొని సమస్యల పరిష్కారానికి పోరాటం సాగించాలని రామకోటి భక్తసమాజం వ్యవస్థాపక అధ్యక్షుడు రామకోటి రామ రాజు పేర్కొన్నారు. చంద్రశేఖర్ ఆజాద్ 117వ జయంతి సందర్భంగా గజ్వేల్ పట్టణంలో సబ్బు బిళ్ల పై ఆయన రూపాన్ని చిత్రించి నివాళులర్పించారు.

వ్యాయామంతో సంపూర్ణ ఆరోగ్యం



యువకులకు బహుమతులు అందిస్తున్న సీఐ కృష్ణ

దుబ్బాక: వ్యాయామం, రన్నింగ్, యోగాతో సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని దుబ్బాక సీఐ మున్నూరు కృష్ణ అన్నారు. ఆదివారం దుబ్బాక మున్సిపల్ పరిధిలోని దుంపలపల్లి నుంచి దుబ్బాక వరకు తిరిగి దుబ్బాక నుంచి దుంపలపల్లి వరకు దుబ్బాక పోలీస్ శాఖ ఆధ్వర్యంలో 10కే రన్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీలను దుబ్బాక సీఐ మున్నూరు కృష్ణ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మారుతున్న కాలంలో మనం ఆరోగ్యంపై శ్రద్ధ వహించడం ఎంతైనా అవసరమన్నారు. ఆగస్టు 6వ తేదీన మంత్రి హరీశ్‌రావు, జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సిద్దిపేట పట్టణంలోని రంగనాయకసాగర్ వద్ద నిర్వహించే హాఫ్ మారథాన్ పోటీల్లో యువకులు అధిక సంఖ్యలో పాల్గొని తమ సత్తా చాటాలని కోరారు. అనంతరం 10కే రన్ పోటీల్లో గెలుపొందిన యువకులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో దుంపలపల్లి కౌన్సిలర్ ఇల్లందుల శ్రీనివాస్, పీఈటీ షాదుల్, యువకులు అధికం రాజ్‌గౌడ్ , హరీశ్, నరేశ్ తదితరులున్నారు.

పండ్ల తోటలతో అదనపు ఆదాయం



గాంధీనగర్‌లో కొబ్బరి మొక్కలను పెంచుతున్న రైతు మురళీధర్‌రావు

హుస్నాబాద్‌రూరల్: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పండ్ల తోటల పెంపకానికి అవకాశం ఉందని, సన్న, చిన్నకారు రైతులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ కుమారస్వామి ఆదివారం తెలిపారు. గతం కంటే మెరుగైన పండ్ల తోటలు, పొలాల గట్లపై కొబ్బరి మొక్కల పెంపకంతో పాటు, డ్రాగన్ ఫ్రూట్స్, ఫిల్ బేరు, అల్లరేగడి, మునుగ తోటల పెంపకానికి ఉపాధిహామీలో ప్రభుత్వం అవకాశం కల్పించినట్లు చెప్పారు. మార్కెటింగ్ గల డ్రాగన్ ఫ్రూట్, ఆపిల్ బేరు, కొబ్బరి మొక్కలను పెంచితే రైతులకు పంటల దిగుబడులకు తోడు అదనపు ఆదాయం వస్తుందన్నారు. తోటలు పెంచే రైతులకు బిందు సేద్యం కోసం డ్రిప్ పరికరాలను కూడా సబ్సిడీపై అందిస్తారని చెప్పారు. ఆసక్తి గల రైతులు గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఫీల్డ్ అసిస్టెంట్లను సంప్రదించాలన్నారు.

కార్మికుల హక్కుల పరిరక్షణకు పోరాటాలు



రాణే పరిశ్రమ వద్ద బీఎంఎస్ జెండాను ఆవిష్కరిస్తున్న యూనియన్ నాయకులు

గజ్వేల్: కార్మికుల హక్కుల పరిరక్షణకు బీఎంఎస్(భారతీయ మజ్దూర్ సంఘ్) నిరంతర పోరాటాలను కొనసాగిస్తోందని ఆ యూనియన్ రాణే పరిశ్రమ శాఖ ప్రధాన కార్యదర్శి శ్రీశైలం, వర్కింగ్ ప్రెసిడెంట్ సల్ల శ్రీనివాస్‌లు అన్నారు. ఆదివారం గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని రాణే ఫ్యాక్టరీలో బీఎంఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఈ వారు మాట్లాడుతూ.. ఎన్నో పోరాటాల ఫలితంగా కార్మికుల సమస్యలను పరిష్కరించుకోగలిగామని, ఇదే స్ఫూర్తితో ముందుకు సాగుతామన్నారు. అంతకుముందు యూనియన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి కిష్టయ్య జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు నజీర్, రాములు, యాదగిరి, పరశురామ్, దేవయ్య, భాస్కర్, మల్లయ్య, రంగయ్య, ఇమాముద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

మైసమ్మ ఆశీస్సులు అందరిపై ఉండాలి

ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు



అమ్మవారికి మొక్కులు చెల్లిస్తున్న మంత్రి హరీశ్‌రావు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పట్టణంలో లాల్‌కమాన్ గడి మైసమ్మ బోనాల ఉత్సవాలు ఆదివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. వైశ్యులు అమ్మవారికి బోనాలను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. మహిళలు ఏకరూప దుస్తులు ధరించి నిర్వహించిన బోనాల ఊరేగింపు కనుల పండువగా కొనసాగింది. ఈ ఉత్సవాల్లో మంత్రి హరీశ్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. మైసమ్మ ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ప్రార్థించినట్లు తెలిపారు.

శరభేశ్వర ఆలయ పాలకవర్గ ప్రమాణస్వీకారం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పట్టణంలోని ప్రాచీన శైవ క్షేత్రం శరభేశ్వర ఆలయ నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారోత్సవం ఆదివారం జరిగింది. ఆలయ శాశ్వత చైర్మన్ రాజేశ్వరశర్మ, సభ్యులుగా ఎల్లేశం, నాగరాజు, అనిత, నాగరాజు, బేజుగాం మల్లేశం, చింత చందులు ప్రమాణస్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి హరీశ్‌రావు హాజరయ్యారు. ఆలయ అర్చకులు మంత్రికి ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో మంత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

బసవేశ్వరుని జీవితం ఆదర్శం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): బసవేశ్వరుని జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని అందరూ ముందుకు సాగాలని మంత్రి హరీశ్‌రావు అన్నారు. పట్టణంలోని రెడ్డి ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన వీరశైవ బలిజ సమాజ సమావేశంలో జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్‌తో కలిసి మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా బసవేశ్వరుడి విగ్రహానికి పూలమాలలు వేశారు. అంతకుముందు సిద్దిపేట నియోజకవర్గ వీరశైవ బలిజ సమాజం ఓటు మంత్రికే అని తీర్మానించారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, రాజనర్సు, పాల సాయిరాం పాల్గొన్నారు.

ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణి వీడాలి



అక్కన్నపేటలో ఉరితాళ్లతో వినూత్నంగా నిరసన తెలుపుతున్న కార్మికులు

అక్కన్నపేట(హుస్నాబాద్): తమ న్యాయపరమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని నిరసిస్తూ ఆదివారం కార్మికులు ఉరితాళ్లతో నిరసన తెలిపారు. అక్కన్నపేట మండలం ఎంపీడీఓ కార్యాలయం ఎదుట చేపట్టిన పంచాయతీ కార్మికుల సమ్మె 18వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా కార్మికులు సమ్మె శిబిరంలో ఉరితాళ్లతో వినూత్నంగా నిరసన గళం విప్పారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఈ నెల 27వ తేదీన జిల్లా కలెక్టరేట్ కార్యాలయాన్ని ముట్టడి సమ్మెను మరింత ఉధృతంగా చేస్తామన్నారు. ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి వీడి మా డిమాండ్లను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో కార్మికులు వేముగంటి సాయిలు, రాజేశం, రాజు, ఓదెలు, లచ్చిరాం, రమేష్, సమ్మయ్య, కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

రాయపోలు(దుబ్బాక): కార్మికులు చేపట్టిన నిరసన 18వ రోజుకు చేరుకుంది. ఆదివారం దౌల్తాబాద్, రాయపోలు మండల కేంద్రాల్లో ఆయా మండలాలకు చెందిన గ్రామ పంచాయతీ కార్మికులు నిరసన దీక్షలు చేశారు. దౌల్తాబాద్‌లో కార్మికులు ఒంటికాలిపై నిలబడి నిరసన తెలిపారు. ప్రభుత్వం స్పందించి తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు.

ప్రతిపక్షాల కుట్రలను తిప్పికొట్టాలి

జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి



యువతకు లెర్నింగ్ లైసెన్సులు అందిస్తున్న ఎమ్మెల్యే ముత్తిరెడ్డి

చేర్యాల(సిద్దిపేట): ప్రాణత్యాగాలు చేసి సాధించుకున్న రాష్ట్రాన్ని ఆగం చేసేందుకు ప్రతిపక్షాలు చేస్తున్న కుట్రలను తిప్పికొట్టాలని ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి అన్నారు. ఆదివారం పట్టణ కేంద్రంలోని కల్యాణి గార్డెన్‌లో పట్టణ, చేర్యాల, కొమురవెల్లి మండలాలకు చెందిన 500మంది యువతీ, యువకులకు ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి లెర్నింగ్ లైసెన్సులు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాంగ్రెస్, బీజేపీలు ఒక్కటై రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకుంటున్నాయన్నారు. అధికారం కోసం బీజేపీ, కాంగ్రెస్‌లు రాజకీయ కుట్రలు చేస్తున్నాయని విమర్శించారు. ప్రతిపక్షాలు చేస్తున్న అసత్య ప్రచారాలు యువత నమ్మొద్దన్నారు. నేటి వరకు డ్రైవింగ్ లైసెన్సుల కోసం 11వేల దరఖాస్తులు వచ్చాయని, మరో 6 వేలు వచ్చే అవకాశం ఉందన్నారు. ఒక్కో లైసెన్సుకు రూ.2500ల చొప్పున సొంత ఖర్చులతో లైసెన్స్ ఇప్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉల్లంపల్లి కరుణాకర్, మున్సిపల్ చైర్‌పర్సన్ అంకుగారి స్వరూపారాణి, కొమురవెల్లి జెడ్పీటీసీ సిలువేరు సిద్దప్ప, మార్కెట్ చైర్మన్ సుంకరి మల్లేశం, మున్సిపల్ వైస్ చైర్మన్ నిమ్మ రాజీవ్‌కుమార్‌రెడ్డి, చేర్యాల, కొమురవెల్లి మండలాల అధ్యక్షులు అనంతుల మల్లేశం, గీస భిక్షపతి, వైస్ ఎంపీపీ నవీన్‌రెడ్డి, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు పెడతల ఎల్లారెడ్డి, నాలుగు మండలాల యూత్ ఇన్‌చార్జి శివగారి అంజయ్య, నాయకులు రాజేశ్, గిరిధర్, బుచ్చిరెడ్డి పాల్గొన్నారు.

అపూర్వ సమ్మేళనం



బెజ్జంకి(సిద్దిపేట): ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు



మద్దూరు: రేబర్తి పాఠశాలలో..

బెజ్జంకి(సిద్దిపేట): బెజ్జంకి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1994-95లో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం బెజ్జంకి సత్యార్జున ఫంక్షన్ హాల్‌లో ఘనంగా అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. అప్పటి ఉపాధ్యాయులు, సిబ్బందిని సన్మానించారు. అనంతరం గత స్మృతులను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ గాజర్ల రమేశ్, విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మద్దూరు(హుస్నాబాద్): మండలంలోని రేబర్తి గ్రామంలోని ఉన్నత పాఠశాలలో 1996-97 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. మండల కేంద్రంలోని తాజ్ గార్డెన్‌లో ఒకచోట కలుసుకొని జ్ఞాపకాలను నెమరుసుకున్నారు. చాలారోజుల తర్వాత కలిసిన స్నేహితులు ఒకరికొకరి యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారికి చదువు చెప్పిన గురువులను ఘనంగా సత్కరించారు.

సీఎం, మంత్రి చిత్రపటాలకు క్షీరాభిషేకం



సిద్దిపేటకమాన్: క్షీరాభిషేకం చేస్తున్న ప్రజాప్రతినిధులు, దివ్యాంగులు

సిద్దిపేటకమాన్: దివ్యాంగులకు అందించే పింఛన్ రూ.3016 నుంచి రూ.4016లకు రాష్ట్ర ప్రభుత్వం పెంచినందుకు సిద్దిపేట మున్సిపాలిటీ పరిధి 1వ వార్డు లింగారెడ్డిపల్లిలో సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావు చిత్రపటాలకు ఆదివారం క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, దివ్యాంగులు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

రాయపోలు(దుబ్బాక): దౌల్తాబాద్ మండలం ఇందుప్రియాల్‌లో మండల పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో మండల నాయకులు సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ వీరమ్మమల్లేషం, నాయకులు యాదగిరి, శ్రీనివాస్, షాదుల్లా, ముత్యంగౌడ్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పెన్షన్ పెంపుపై హర్షం

మిరుదొడ్డి(దుబ్బాక): రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగులకు పెన్షన్ పెంచడంపై ఉస్మానియా యూనివర్శిటీ పీహెచ్‌డీ స్కాలర్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు మొగుళ్ల ఐలయ్య హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం మిరుదొడ్డిలో ఆయన మాట్లాడుతూ.. దివ్యాంగులను దృష్టిలో పెట్టుకొని సీఎం కేసీఆర్ ప్రభుత్వం పెన్షన్ పెంచడం సంతోషకరమన్నారు. దివ్యాంగుల పక్షాన సీఎం కేసీఆర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. ఎలాంటి పైచికత్తు లేకుండా దివ్యాంగులకు రూ.10లక్షల బ్యాంక్ రుణాలను అందజేయాలన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ పంట నష్టపరిహారం చెల్లించాలి

చిన్నకోడూరు(సిద్దిపేట): యాసంగిలో అకాల వర్షాలతో పంటలకు నష్టం వాటిల్లితే ఎకరాకు రూ.10వేల నష్టపరిహారం ప్రకటించిన ప్రభుత్వం ఇంకెప్పుడిస్తారని కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు డా. సూర్యవర్మ ప్రశ్నించారు. ఆదివారం ఆయన చిన్నకోడూరులో మాట్లాడుతూ.. వానాకాలం నాట్లు మొదలైన యాసంగిలో దెబ్బతిన్న పంటలకు ఇంకా పరిహారం చెల్లించకపోవడం ప్రభుత్వానికి రైతులపై ఉన్న ప్రేమ అర్థమవుతుందన్నారు. రైతుల పక్షాన కాంగ్రెస్ పోరాడుతుందన్నారు. ఆయన వెంట నాయకులు చిరంజీవి, ఎల్లం , దిలీప్, వెంకట్, ప్రసాద్ తదితరులు ఉన్నారు.

◆ కేసీఆర్ పాలనలో సంక్షేమం కొత్త పుంతలు

గజ్వేల్: సీఎం కేసీఆర్ పాలనలో సంక్షేమం కొత్త పుంతలు తొక్కుతోందని గజ్వేల్ మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ అన్నారు. ఆదివారం గజ్వేల్‌లోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. రాష్ట్రంలోని అన్ని వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. పింఛన్ పెంపుతో దివ్యాంగుల్లో ఆత్మస్థైర్యం పెరుగుతుందన్నారు. స్వరాష్ట్రంగా అవతరించిన తొమ్మిదేళ్లలో తెలంగాణ నేడు దేశంలోనే అన్ని రంగాలకు అగ్రగామిగా ఆవిర్భవించిందని అభిప్రాయపడ్డారు. సమావేశంలో నాయకులు కల్యాణ్‌కర్ నర్సింగరావు, శివకుమార్, బాబు, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

◆ రెవెన్యూ డివిజన్ జేఏసీ అర్జునపట్ల గ్రామ కమిటీ ఎన్నిక

చేర్యాల(సిద్దిపేట): చేర్యాల రెవెన్యూ డివిజన్ సాధనకు చేస్తున్న ఉద్యమంలో భాగంగా 4 మండలాల పరిధిలోని గ్రామాల్లో జేఏసీ గ్రామ కమిటీల ఎన్నికను మండల జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా ఆదివారం మండల పరిధిలోని అర్జునపట్ల గ్రామ జేఏసీ కమిటీ ఎన్నిక మండల కన్వీనర్ బొమ్మగాని అంజయ్య ఆధ్వర్యంలో జరిగింది. ఎన్నికలో కన్వీనర్‌గా సింగపాక కనకయ్య, కో-కన్వీనర్లుగా భీంరెడ్డి జగ్గారెడ్డి, పొన్నం మల్లేశం, చోటేమియా, కార్యదర్శిగా సింగపాక కుమార్, సహాయ కార్యదర్శిగా తాళ్లపల్లి నర్సింహులు, తిరుచయ్య, లింగాల బాలయ్య, బైతి శ్రీశైలం, కోశాధికారిగా గొల్లపల్లి చంద్రమౌళి, కార్యవర్గ సభ్యులుగా రహీం, రాజు, రవీందర్‌రెడ్డి, రాంచంద్రం, శ్రీనివాస్, వెంకటయ్య, కనకయ్య, లింగం, శ్రీకాంత్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

◆ డైట్ చార్జీల పెంపుపై హర్షం

గజ్వేల్‌రూరల్: హాస్టల్, గురుకుల విద్యార్థులకు ప్రభుత్వం డైట్ చార్జీలను పెంచడంపై హర్షం వ్యక్తం చేస్తున్నట్లు డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ పేర్కొన్నారు. ఆదివారం గజ్వేల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈ విద్యాసంవత్సరం నుంచి డైట్ చార్జీలను పెంచి ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకుందని, అదే విధంగా కాస్మోటిక్ చార్జీలను సైతం పెంచాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో డీబీఎఫ్ నాయకులు ఏగొండస్వామి తదితరులు పాల్గొన్నారు.

◆ నియామకం

బెజ్జంకి(సిద్దిపేట): అఖిల భారత యాదవ మహాసభ జిల్లా ఉపాధ్యక్షుడిగా బెజ్జంకి మండల కేంద్రానికి చెందిన దొంతరవేణి శ్రీనివాస్‌యాదవ్, జిల్లా కార్యదర్శిగా వడ్లూరి గ్రామానికి చెందిన అమ్ముల ఓదయ్య యాదవ్‌లను నియమించారు. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఉమ్మడి మెదక్ జిల్లా గొర్రెల పెంపకదారుల సహకార సంఘం చైర్మన్ పోచబోయిన శ్రీహరియాదవ్, అఖిల భారత యాదవ మహాసభ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు మామిండ్ల ఐలయ్య యాదవ్‌లు ఆదివారం నియామకపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో యాదవ సంఘం మండల అధ్యక్షుడు మ్యాకల శ్రీకాంత్‌యాదవ్, జిల్లా నాయకులు రొడ్డ మల్లేశం యాదవ్, రవియాదవ్, అమ్ముల రాముయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

◆ గుండెపోటుతో ఆర్టీసీ కండక్టర్ మృతి

దుబ్బాకటౌన్: దుబ్బాక బస్ డిపోలో కండక్టర్(8017754)గా పనిచేస్తున్న ఎల్.నీరజారెడ్డి గుండెపోటుతో శనివారం రాత్రి మృతి చెందారు. నీరజారెడ్డి ఆరోగ్యం బాగాలేకపోవడంతో కుటుంబ సభ్యులు సికింద్రాబాద్ యశోద ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఈ క్రమంలోనే ఆస్పత్రిలోనే గుండెపోటు వచ్చి నీరజారెడ్డి మృతి చెందారు. మృతదేహాన్ని ఆదివారం తెల్లవారుజామున దుబ్బాకకు తీసుకొచ్చారు. నీరజారెడ్డి అంత్యక్రియల్లో ఆర్టీసీ కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని ఆమెకు నివాళులర్పించారు.

◆ కుల సంఘాల అభివృద్ధే ధ్యేయం

సిద్దిపేటకమాన్: సిద్దిపేటలో కుమ్మరి సంఘానికి రెండు ఎకరాల స్థలాన్ని కేటాయించడంతో పాటు, నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో కుల సంఘాలకు స్థలాలు కేటాయించిన ఘనత మంత్రి హరీశ్‌రావుదే అని కుమ్మరి సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ అన్నారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం మాట్లాడుతూ.. సిద్దిపేటలో కుమ్మరి కులస్తులకు మంత్రి హరీశ్‌రావు చేసిన అభివృద్ధిని చూసి తట్టుకోలేక కొంత మంది కులాన్ని విచ్ఛిన్నం చేసే ప్రయత్నం చేస్తున్నారన్నారు. రాష్ట్ర నాయకత్వం నుంచి ఆదేశాలు లేకుండా జిల్లా కమిటీని రద్దు చేయరాదని, ప్రస్తుతం ఉన్న కమిటీనే కొనసాగుతుందన్నారు. సమావేశంలో నర్సింలు, శ్రీనివాస్, విజయ్, రవిందర్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

గజ్వేల్‌రూరల్: మణిపూర్ ఘటనకు కారకులైన నిందితులను కఠినంగా శిక్షించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎల్లయ్య, అంబేడ్కర్ సంఘం జిల్లా అధ్యక్షుడు చిప్పల యాదగిరి, మాల మహానాడు రాష్ట్ర నాయకుడు తుమ్మ శ్రీను, ఎమ్మార్పీఎస్ పోలిట్ బ్యూరో సభ్యులు మైస రాములు డిమాండ్ చేశారు. మణిపూర్‌లో జరిగిన ఘటనకు ప్రధాని మోదీ రాజీనామా చేయడంతో పాటు ఆ రాష్ట్ర సీఎం బీరెన్ సింగ్‌ను పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ ఆదివారం గజ్వేల్ పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద ప్లకార్డులతో నిరసన తెలిపారు. కార్యక్రమంలో నాయకులు స్వామి, రంగారెడ్డి, ఐలయ్య, వెంకటచారి, స్వామి, మహేందర్ రెడ్డి, రాజు, మనోజ్, కుమార్, నర్సింలు, మహేశ్, శ్రీనివాస్, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
సిద్దిపేట
సోమవారం, 24, జూలై, 2023



చిన్న, సన్నకారుకు ప్రో(ఉ)త్సాహం

ఉద్యాన పంటల విస్తీర్ణాన్ని పెంచేందుకు ప్రభుత్వం మామిడి, బత్తాయి, డ్రాగన్ ఫ్రూట్ తదితర పండ్ల తోటలు సాగుచేసే రైతులకు రాయితీ ఇచ్చి ప్రోత్సహిస్తోంది. 8లో



ఆహ్లాదకరం.. ప్రకృతి వనం

అక్కన్నపేట మండలం గండిపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనం పచ్చదనంతో కళకళలాడుతోంది. పార్కును తలపించేలా ఏర్పాట్లు చేశారు. 9లో..

దరఖాస్తుల ఆహ్వానం

గజ్వేల్‌రూరల్: పట్టణంలోని బాలికల ఎడ్యుకేషన్ హబ్‌లోగల ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో గెస్ట్ లెక్చరర్లుగా వివిధ సబ్జెక్టులను బోధించేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ పీవీ ఉమాశశి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈనెల 25న కళాశాలలో జరిగే ఇంటర్వ్యూలకు ధ్రువపత్రాలతో హాజరు కావాలని సూచించారు.

న్యూస్‌రీల్

దేశంలోనే అతిపెద్ద కార్మిక సంఘం బీఎంఎస్



దుబ్బాకలో బీఎంఎస్ జెండాను ఆవిష్కరిస్తున్న కలాల్ శ్రీనివాస్

దుబ్బాకటౌన్: కోటికి పైగా సభ్యత్వం, ఐదు వేలకు పైగా అనుబంధ సంఘాలతో బీఎంఎస్ దేశంలోనే అతిపెద్ద కార్మిక సంఘంగా అవతరించిందని ఆ సంఘం ఆల్ ఇండియా ఆర్గనైజింగ్ సెక్రటరి కలాల్ శ్రీనివాస్ అన్నారు. ఆదివారం దుబ్బాకలోని దేశాయి బీడీ కంపెనీ లిమిటెడ్ ఎదుట బీఎంఎస్ జెండాను ఆవిష్కరించి ఆయన మాట్లాడారు. కార్మికులకు బీఎంఎస్ అండగా ఉంటుందన్నారు. వారికి పని తగిన వేతనం అందేలా పోరాడుతామని అన్నారు. సెజ్‌లను వ్యతిరేకిస్తూ అసంఘటిత రంగ కార్మికుల ప్రయోజనాలను పరిరక్షించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి బుద్దం రాజిరెడ్డి, కొండల్‌రెడ్డి, చంద్రమౌళి, రాజు, యాదగిరి, కడవేర్గు శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

విద్యా వ్యవస్థ పట్ల ప్రభుత్వ వైఖరి మారాలి



సమావేశంలో మాట్లాడుతున్న తపస్ రాష్ట్ర కార్యదర్శి శ్రీనాకర్‌రెడ్డి

ప్రశాంత్ నగర్(సిద్దిపేట): సీపీఎస్ ఉద్యోగుల పట్ల ప్రభుత్వం వివక్ష చూపుతుందని, వెంటనే వారికి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించి న్యాయం చేయాలని తపస్ రాష్ట్ర కార్యదర్శి శ్రీనాకర్ రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం జిల్లా కేంద్రంలో స్థానిక శిశుమందిర్‌లో తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) ఆధ్వర్యంలో ఉద్యమ జాగరణ కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తూ, ఉపాధ్యాయుల సమస్యలను గాలికొదిలేసిందన్నారు. సీపీఎస్ సమస్య పరిష్కారానికి ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం శోచనీయం అన్నారు. ప్రభుత్వ వైఖరికి నిరసనగా తెలంగాణ ఉపాధ్యాయ సంఘం జూలై 18 నుంచి ఆగస్టు 19 వరకు వివిధ దశలలో నిరసన కార్యక్రమాలు చేపడుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు ఊడెం రఘువర్ధన్ రెడ్డి, జిల్లా కార్యదర్శి మురళి, రాష్ట్ర బాధ్యులు శివ, జిల్లా ఉపాధ్యక్షులు బాలకిషన్, కార్యదర్శి స్వామిగౌడ్, రామ్‌రెడ్డి, వేణు కోశాధికారి సురేందర్‌రెడ్డి, శ్రీకాంత్, దేవదాస్, చారి, తిరుపతిరెడ్డి, రామాంజనేయులు, వెంకట్ రామ్ రెడ్డి, రాములు, రమణ, శ్రీను, గోపాల్ రెడ్డి, సురేందర్ రెడ్డి పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీని కాపాడుకోవాలి



రిజర్వాయర్ పనులను ప్రారంభిస్తున్న ఆయిల్‌ఫెడ్ చైర్మన్ రామకృష్ణారెడ్డి

నంగునూరు(సిద్దిపేట): రైతులు ఆయిల్‌పామ్ పంటను సాగు చేసి ఫ్యాక్టరీని కాపాడుకోవాలని ఆయిల్‌ఫెడ్ చైర్మన్ కంచర్ల రామకృష్ణారెడ్డి అన్నారు. నంగునూరు మండలం నర్మేటలో నిర్మిస్తున్న ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీకి నీటి వసతి కల్పించేందుకు చేపట్టిన రిజర్వాయర్ పనులను ఆదివారం ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ నాడు ఆయిల్‌పామ్ సాగుకు తెలంగాణ ప్రాంతం అనుకూలం కాదని ఆయిల్‌ఫెడ్ సంస్థ చెప్పిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సాగునీటి సౌకర్యం కల్పించడంతో పాటు రంగనాయక సాగర్ నిర్మాణం వల్ల 25 జిల్లాలు ఆ పంటకు అనుకూలంగా మరాయన్నారు. నర్మేటలో రూ.247 కోట్లతో నిర్మిస్తున్న ఫ్యాక్టరీ దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని, దానికి అవసరమయ్యే విద్యుత్ ఉత్పత్తి ఇక్కడే చేస్తారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 31 వేల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు చేస్తున్నారని, లక్ష ఎకరాల్లో సాగయ్యేలా చూడాలన్నారు. కార్యక్రమలో ఆయిల్‌ఫెడ్ ఎండీ సురేందర్‌రెడ్డి, జీఎం సుధాకర్‌రెడ్డి, జెడ్పీటీసీ ఉమ, ఆయిల్ పామ్ ఫార్మర్స్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోమిరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, సారయ్య, వెంకట్‌రెడ్డి, రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు నాగిరెడ్డి, కృష్ణారెడ్డి, సర్పంచ్ అజీద్, ఎంపీటీసీ బాబు తదితరులు పాల్గొన్నారు.

అతివృష్టితో విపత్తి

- తెరిపిలేని వర్షాలతో పంటకు నష్టం
- జిల్లాలో 90వేల ఎకరాల్లో పత్తి సాగు
- మరో 30వేల ఎకరాల్లో సాగయ్యే అవకాశం
- ఆదిలోనే ప్రతికూల పరిస్థితులతో రైతుల ఆందోళన



జగదేవ్‌పూర్ మండలం అనంతసాగర్‌లో వర్షం నీటిలో మునిగిన పత్తి చేను

తెల్ల'బంగారం'గా చెప్పుకునే పత్తికి అతివృష్టి తీవ్ర నష్టాన్ని కలుగజేస్తుంది. ఎడతెరిపిలేని వర్షాల కారణంగా ఆదిలోనే చేలల్లో నీరు నిలిచి రైతుల ఆశలను గల్లంతు చేస్తోంది. పంట ఎదుగుదలపై తీవ్ర ప్రభావం చూపనుంది. వ్యవసాయశాఖ మాత్రం ఇప్పటివరకు కురిసిన వర్షాలకు ఎలాంటి ఇబ్బంది లేదని, చిన్నపాటి జాగ్రత్తలతో ఈ సమస్యను అధిగమించవచ్చని చెబుతుంది.

గజ్వేల్: జిల్లాలో ఇప్పటికే సుమారు 90వేల ఎకరాల్లో పత్తి సాగులోకి రాగా.. మరో 30 వేల ఎకరాల్లో సాగయ్యే అవకాశముంది. పత్తితో జిల్లాకు విడదీయరాని అనుబంధం ఉంది. వరి తర్వాత పత్తి, మొక్కజొన్న పంటలు ఇక్కడి రైతులకు ప్రధాన ఆధారం. తక్కువ కాలంలో రైతులను స్థితిమంతులను చేయడం లేదా భారీ నష్టాలను చవిచూపి అప్పులపాలు చేయడం పత్తి పంట ప్రత్యేకత.

సాగు తీరు ఇలా..

జిల్లాలో ఈసారి 5.78లక్షల ఎకరాల సాగు లక్ష్యంగా ఉంది. ఇందులో ఇప్పటివరకు 1.70లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగులోకి వచ్చాయి. ఇందులో ఇప్పటివరకు వరి 45వేల ఎకరాలు సాగులోకి రాగా, మరో 3లక్షల ఎకరాలు సాగులోకి వచ్చే అవకాశముంది. మొక్కజొన్న 16,576 ఎకరాల్లో సాగులోకి వచ్చింది. ప్రత్యేకించి పత్తి 90వేల ఎకరాల్లో సాగు చేశారు. మరో 30వేల ఎకరాల్లో సాగులోకి వచ్చే అవకాశం ఉంది. గతేడాదితో పోలిస్తే 30వేల ఎకరాల్లో సాగు తగ్గనుంది.

జోరు వానలతో..

ఇదిలావుంటే సీజన్ ఆరంభంలో వర్షాలు పత్తా లేకపోగా, ప్రస్తుతం అయిదారు రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తుండటంతో పత్తి పంట నీటి మునిగి రంగుమారుతోంది. మరోవైపు వేరుకుళ్లు, ఇతర తెగుళ్లు విజృంభించే ప్రమాదముంది. కాలం కలిసొస్తే మంచి దిగుబడులు రావడంతోపాటు ధర కూడా ఆశించిన విధంగా పలకవచ్చనే ఆశతో రైతులు పత్తిని సాగు చేస్తుండగా...అతివృష్టి వారి ఆశలపై నీళ్లు చల్లింది. జూన్ నెలలో 104.9మి.మీల సాధారణ వర్షపాతానికి కేవలం 77.2మి.మీ. మాత్రమే నమోదైంది. ఈ లెక్కన 26మి.మీల లోటు వర్షపాతం నమోదైంది. జూలై నెల వచ్చే సరికి సీను మారిపోయింది. జూలైలో 126.1మి.మీల సాధారణ వర్షపాతానికి 22వ తేదీ నాటికే 322.3మి.మీ. నమోదైంది. ఈ లెక్కన 156 మి.మీల అధిక వర్షపాతం నమోదైంది.

ఇప్పటివరకు ములుగు, వర్గల్, రాయపోల్, జగదేవ్‌పూర్, కుకునూర్‌పల్లి, తొగుట, దుబ్బాక, అక్కన్నపేట తదితర మండలాల్లో అత్యధిక వర్షపాతం నమోదైంది. వర్షాలు ఇలాగే కొనసాగితే చెలక, నల్లరేగడి భూముల్లో పత్తికి తీవ్ర నష్టం కలగనుంది. అంతేగాకుండా గడ్డి విపరీతంగా పెరిగి, మొక్కలకు వేరు తెగుళ్లు వ్యాపించే అవకాశముంది. జిల్లాలో ఇప్పటివరకు రైతులు పత్తి పంటను ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేశారు. వర్షాల కారణంగా ఈ పంటకు నష్టం వాటిల్లే పరిస్థితి ఏర్పడటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

జాగ్రత్తలతో నష్టం నివారించొచ్చు



జిల్లాలో ఇప్పటివరకు కురిసిన వర్షాలతో పత్తి పంటకు ఎలాంటి ఇబ్బంది లేదు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. క్షేత్రస్థాయిలో రైతులను అప్రమత్తం చేస్తున్నాం. పత్తి చేలల్లో నీరు నిలవకుండా చూసుకోవాలి. క్షేత్రసాయిలో అధికారులు అందుబాటులో ఉంటూ లోతట్టు ప్రాంతాల్లో పత్తిని కాపాడుకోవడానికి రైతులకు అవసరమైన సలహాలు, సూచనలు ఇస్తున్నారు.

– శివప్రసాద్, జిల్లా వ్యవసాయాధికారి

స్వచ్ఛత సైనికులుగా మారాలి

సిద్దిపేట పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత




చెత్తను ఏరుతున్న సీపీ శ్వేత

సిద్దిపేటజోన్: వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తూ పరిసరాలను శుభ్రంగా ఉంచేందుకు ప్రతిఒక్కరూ స్వచ్ఛత సైనికులుగా మారాలని సిద్దిపేట పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత పిలుపునిచ్చారు. ఆదివారం ఉదయం 6 గంటలకు పోలీస్ శాఖ, సిద్దిపేట రన్నర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 'నడకతో చెత్త ఏరివేద్దాం' కార్యక్రమంలో సీపీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి పాత బస్టాండ్ వరకు కాలి నడకన ర్యాలీగా బయలుదేరారు. ప్రధాన రోడ్డుపై ఉన్న చెత్త చెదారం, ప్లాస్టిక్ బాటిళ్లు ఏరి శ్రమదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. స్వచ్ఛ సిద్దిపేటలో భాగంగా చెత్త సేకరణ చేస్తున్నట్టు పేర్కొన్నారు. పచ్చదనం, పరిశుభ్రతకు సిద్దిపేట మారుపేరు అని.. ప్రతి ఒక్కరూ తడి, పొడి చెత్త వేరుచేసి మున్సిపల్ పారిశుద్ధ్య సిబ్బందికి ఇవ్వాలని సూచించారు. రోడ్డు మీద చెత్త వేయరాదని, ప్లాస్టిక్ నిషేధం అమలులో ఉందని వివరించారు. ఆరోగ్య, స్వచ్ఛ సిద్దిపేట కోసం మంత్రి హరీశ్‌రావు చేస్తున్న కృషికి అండగా నిలవాలని సూచించారు. ప్రతి ఒక్కరి జీవనశైలిలో వ్యాయామం తప్పనిసరి అని.. రోజూ వాకింగ్, యోగా, ధ్యానం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శాంతి, సిద్దిపేట ఏసీపీ సురేందర్ రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్స్, వైస్ చైర్మన్ కనకరాజు, మున్సిపల్ కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, అధికారులు, అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

చర్చిలో గురువుల దినోత్సవం

మెదక్‌జోన్: మెదక్ సీఎస్ఐ చర్చిలో ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఉదయం 10 గంటలకు సిలువతో చర్చి చుట్టూ ఊరేగింపు నిర్వహించిన అనంతరం చర్చి ప్రెసిబెటరి ఇన్‌చార్జ్ శాంతయ్య దైవ సందేశం ఇచ్చారు. గురువుల దినోత్సవం కావటంతో మత గురువులతో పాటు వారి సతీమణులకు చర్చికమిటీ సభ్యులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు ఇబ్బందులు కలుగకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.



చర్చిలో ప్రార్థన చేస్తున్న భక్తులు

కొమురవెల్లిలో బ్లాస్టింగ్‌లు

బీటలు వారిన ఆలయ గోడలు

కొమురవెల్లి(సిద్దిపేట)



బ్లాస్టింగ్‌తో దెబ్బతిన్న ఆలయ కార్యాలయపు గోడ

కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయం వద్ద క్యూ కాంప్లెక్స్ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. అందులోభాగంగా గుడి పక్కన కొండ రాళ్లు తొలగించడానికి సదరు కాంట్రాక్టర్ బ్లాస్టింగ్‌లు జరుపుతుండటంతో ఆదివారం ఆలయ కార్యాలయానికి, స్థానిక భవనాల గోడలకు బీటలువారాయి. దీంతో స్వామివారి మూల విరాట్టుకు ఎక్కడ ఇబ్బంది కలుగుతుందోనని భక్తులు ఆందోళన చెందుతున్నారు. పదేపదే బ్లాస్టింగ్‌లు చేయడం వల్ల స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులకు ప్రమాదం బారిన పడే అవకాశముందని, బ్లాస్టింగులు చేసే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని స్థానికులు ఆలయ అధికారులను కోరుతున్నారు. ఈ విషయమై ఆలయ ఈవోకు వినతి పత్రం అందించడానికి వెళ్లిన సమయంలో బ్లాస్టింగ్ జరిగి పెద్ద బండరాయి వచ్చి ఆలయ కార్యాలయం వద్ద పడింది. ఈ విషయంపై ఈవో బాలాజీని వివరణ కోరగా తక్షణమే బ్లాస్టింగ్‌ను నిలిపివేసి, కెమికల్‌తో బండరాళ్లను తొలగించాలని సూచించినట్లు తెలిపారు.

లక్షా పదివేల కోట్లను నిలిపిన కేంద్రం

మంత్రి హరీశ్‌రావు ఆగ్రహం



'రుతుప్రేమ' అవగాహన సదస్సులో మాట్లాడుతున్న మంత్రి హరీశ్ రావు

సిద్దిపేటజోన్: రాష్ట్రానికి రావాల్సిన రూ.లక్షా10వేల కోట్లను కేంద్రం నిలిపివేసిందని రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం రాత్రి మెట్రో గార్డెన్‌లో నిర్వహించిన అంగన్‌వాడీ రాష్ట్రస్థాయి ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్రంలో బీజేపీని గద్దె దించి కేసీఆర్ మద్దతుతో ప్రభుత్వం ఏర్పాటవుతుందని ధీమా వ్యక్తం చేశారు. దేశం మొత్తం రాష్ట్రం అమలు చేస్తున్న పథకాలు కావాలని కోరుకుంటున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్స్, మార్కెట్ కమిటీ చైర్మన్ విజిత వేణుగోపాల్ పాల్గొన్నారు.

సిద్దిపేట కోసం పవిత్ర యజ్ఞం

సిద్దిపేటజోన్: సిద్దిపేట కోసం పవిత్రమైన యజ్ఞం చేస్తున్నానని, ఓట్ల కోసం.. రాజకీయాల కోసం కాదని, నియోజకవర్గ ఆడపడుచుల ఆరోగ్యం కోసమే రుతుప్రేమ కార్యక్రమం చేపట్టినట్లు మంత్రి హరీశ్‌రావు అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని 30, 31 వార్డుల్లో రుతుప్రేమపై ఏర్పాటుచేసిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. అమెరికా, యూరప్ దేశాల్లో ఈ మెన్‌స్ట్రువల్ కప్పులు వాడుతున్నారని, వారి తరహాలో సిద్దిపేట అక్కాచెల్లెళ్లు ముందుకొచ్చి ఆరోగ్యంగా ఉండాలని అన్నారు. తోటి మహిళల కోసం సిద్దిపేట సీపీ శ్వేత, అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్, డాక్టర్ శాంతి చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీ బీబీ పాటిల్, డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య ఆరోగ్య శాఖకు 'ఆశ'లే కీలకం

సిద్దిపేట: రాష్ట్ర ప్రభుత్వం ఆశ కార్యకర్తలకు సముచిత ప్రాధాన్యమిస్తుందని, వైద్య ఆరోగ్య శాఖలో వీరి పాత్ర కీలకమని మంత్రి హరీశ్‌రావు అన్నారు. ఆదివారం స్థానిక క్యాంప్ కార్యాలయంలో ఆశ కార్యకర్తలకు నియామక పత్రాలను అందించి మాట్లాడారు. ఆశలకు రూ.9,900 జీతం, ఫోన్ బిల్లు కలిపి ఇస్తున్నట్లు ప్రకటించారు. అంతకుముందు కాకతీయ యూనివర్సిటీ నుంచి డాక్టర్ బానోతు రజిత మిషన్ కాకతీయపై పరిశోధన చేసి రచించిన పుస్తకాన్ని మంత్రి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నర్సింగ్ కౌన్సిల్ సభ్యులు సాయిరాం, డీఎంహెచ్‌ఓ డాక్టర్ కాశీనాథ్ పాల్గొన్నారు.

ట్రైనింగ్ సెంటర్ ప్రారంభం

సిద్దిపేట ఖాదర్ పురాలో రూ.20 లక్షలతో నిర్మించిన మైనారిటీ కమ్యూనిటీ గార్మెంట్ ప్రొడక్షన్ అండ్ ట్రైనింగ్ సెంటర్‌ను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఐటీ కంప్యూటర్ ఉచిత శిక్షణ పొందిన మైనారిటీ యువతకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ సిద్దిపేట షాదీఖాన-మదీనా ఫంక్షన్ హాల్ మరమ్మతులకు రూ.25 లక్షలు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో మైనారిటీ ఫైనాన్స్ చైర్మన్ మహ్మద్ ఇంతియాజ్ ఇసాక్, మాజీ ఎమ్మెల్సీ ఫారూఖ్ హుస్సేన్ పాల్గొన్నారు.

దళితులకు అండగా ప్రభుత్వం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): దళితులకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా నిలుస్తుందని మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. పట్టణంలో ఆదివారం సావిత్రీబాయి ఉమెన్స్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ సౌజన్యంతో కుట్టుమిషన్‌లో శిక్షణ పొందిన అకునూరు, ముస్త్యాల, చేర్యాల, దుద్దెడ గ్రామాలకు చెందిన 140 మంది మహిళలకు ఉచిత కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి హరీశ్‌రావు పాల్గొని మాట్లాడారు. సీఎం కేసీఆర్ రాష్ట్ర వ్యాప్తంగా 1002 రెసిడెన్షియల్ పాఠశాలలు ఏర్పాటు చేసి దళిత, గిరిజన, బీసీ, మైనార్టీ విద్యార్థులను చదివిస్తున్నారన్నారు. పేద, దళిత మహిళలకు శిక్షణ అందించి ఉచితంగా కుట్టు మిషన్లు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదిరెడ్డి, సావిత్రి బాయి ఉమెన్స్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ చైర్మన్ మాధవి, ఎమ్మెల్సీ ఫారూఖ్ హుస్సేన్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్రీరాంరెడ్డి పాల్గొన్నారు.

రైతులకు అండగా విశ్వకర్మలు



రాచమల్ల పున్నమాచార్యులను సన్మానిస్తున్న విశ్వకర్మలు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): విశ్వకర్మలు రైతులకు అండగా నిలుస్తున్నారని అఖిల భారతీయ విశ్వకర్మ పరిషత్ జాతీయ నాయకులు రాచమల్ల పున్నమాచార్యులు, ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షులు కొత్తపల్లి సత్యనారాయణచార్యులు అన్నారు. ఆదివారం పట్టణంలోని శ్రీగాయత్రి విశ్వకర్మ భగవాన్ దేవాలయ ఆవరణలో నిర్వహించిన విశ్వబ్రాహ్మణుల సమావేశానికి వారు హాజరై మాట్లాడారు. దేశానికి రైతు వెన్నుముక అని పలికే ప్రభుత్వాలు.. అదే వారి కోసం పనిచేసే విశ్వకర్మలను పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. రైతులకు అందించినట్లు వ్యవసాయ పనిముట్లు తయారుచేసే విశ్వకర్మలకు కూడా 24గంటలు ఉచిత విద్యుత్ అందించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా గ్రామీణ ప్రాంతాల్లో కుటీర పరిశ్రమలుగా ఏర్పాటు చేసుకొని జీవిస్తున్న వారందరికీ 200 యూనిట్ల ఉచిత కరెంట్ అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో మనుమయ సంఘం అధ్యక్షులు పబ్బోజు యాదగిరి ఆచార్యులు, పుల్లయ్యగారి శ్రీనివాస్ చారి, మేడోజు నర్సింహచారి, కార్యవర్గ సభ్యులు, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

దసరాలోగా పనులు పూర్తి చేస్తాం

టూరిజం శాఖ ఎండీ మనోహర్ రావు



సుందరీకరణ మ్యాప్‌ను పరిశీలిస్తున్న మనోహర్ రావు

హుస్నాబాద్: ఎల్లమ్మ చెరువు సుందరీకరణ పనులను దసరాలోగా పూర్తి చేస్తామని టూరిజం శాఖ ఎండీ మనోహర్‌రావు అన్నారు. ఆదివారం పట్టణంలోని ఎల్లమ్మ చెరువును ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చెరువు కట్ట మధ్య బతుకమ్మ విగ్రహం, మెట్ల చుట్టూ పూల మొక్కలు ఏర్పాటు చేస్తామని అన్నారు. కట్ట పొడవున విద్యుత్ లైట్లు, రైలింగ్, ఫుట్‌పాత్, కుర్చీలు, వాకర్స్ నడిచే వీలుగా దారి ఏర్పాటు చేస్తామన్నారు. అలాగే ఇక్కడ బోటు సౌకర్యం కల్పిస్తామని తెలిపారు. వర్షాల కారణంగా పనుల్లో జాప్యం జరిగిందని, రెండు, మూడు రోజుల్లో ప్రారంభిస్తామని తెలిపారు. టూరిజం శాఖ ఏఈ జీవన్‌రెడ్డి ఉన్నారు.

మల్లన్న క్షేత్రంలో భక్తుల సందడి



గంగిరేణి చెట్టు వద్ద భక్తులు



వినతి పత్రం అందిస్తున్న అధికారులు

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామి దేవాలయానికి ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. దీంతో ఆలయ పరిసరాలు మల్లన్న నామస్మరణతో మారుమోగింది. పట్నాలు, అభిషేకాలు, అర్చన, ఒడి బియ్యం, ప్రత్యేక పూజలు, కేశఖండన, గంగిరేణు చెట్టుకు ముడుపులు కట్టి చల్లంగా చూడు తండ్రి అని స్వామివారిని వేడుకున్నారు. కొండ పైన రేణుక ఎల్లమ్మ అమ్మవారికి బోనాలు సమర్పించారు. కొంతమంది రాతిగీరల వద్ద ప్రదక్షిణలు, కోడెల స్థంభం వద్ద కోడెలను కట్టి మొక్కులు తీర్చుకున్నారు. భక్తుల కోసం ఏర్పాట్లను ఆలయ చైర్మన్ గీస భిక్షపతి, ఈవో బాలాజీ, ఏఈవో అంజయ్య, ప్రధానార్చకులు మహాదేవుని మల్లికార్జున్ పరిశీలించారు.

ఎంపీ బీబీ పాటిల్ పూజలు

కొమురవెల్లి మల్లికార్జున స్వామిని జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఈవో, అర్చకులు కొమురవెల్లిలో రైల్వే స్టేషన్ ఏర్పాటు చేయాలని ఎంపీకి వినతి పత్రం అందించారు.

మయూర వయ్యారం





సూర్యాస్తమయ వేళ చిరు జల్లుల మధ్య మయూర వయ్యారాలు కనువిందు చేశాయి. ఆహ్లాదకర వాతావరణంలో నెమలి చేసిన నాట్యం అబ్బుర పరిచింది. దుబ్బాక మండలం పర్శరాంనగర్ గ్రామం (జోడిచెర్లు)లో ఈ దృశ్యం కనిపించింది.

- దుబ్బాకటౌన్

క్లుప్తంగా

సవతితల్లి వేధింపులకు కూతురు ఆత్మహత్య

చిలప్‌చెడ్(నర్సాపూర్): సవతితల్లి వేధింపులు తాళలేక కూతురు ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన చిలప్‌చెడ్ మండలం సోమక్కపేట్‌లో ఆదివారం జరిగింది. ఎస్‌ఐ మహ్మద్‌గౌస్ కథనం ప్రకారం.. సోమక్కపేట్‌కు చెందిన నీరుడి మల్లయ్యకు ఇద్దరు భార్యలు. పెద్దభార్య దుర్గమ్మకు చెన్నమ్మ, బాలమ్మ అనే ఇద్దరు కూతుళ్లున్నారు. చిన్నభార్య బుజ్జమ్మకు విజయ, వెన్నెల అనే ఇద్దరు కుమార్తెలున్నాయి. వీరందరికీ వివాహాలు జరిగాయి. బాలమ్మ పెళ్లయిన కొద్దిరోజులకు భర్త నుంచి విడిపోయి పుట్టింట్లోనే ఉంటోంది. కాగా ఆమె తల్లి, తండ్రి ఇద్దరూ మరణించారు. 20 ఏళ్లుగా తన సవతి తల్లి బుజ్జమ్మ వద్దే ఉంటోంది. శనివారం రాత్రి బుజ్జమ్మ, బాలమ్మ గొడవపడ్డారు. ఈ గొడవలో బాలమ్మను కొట్టి, ఇష్టం వచ్చినట్లు తిట్టడంతో, మనస్తాపానికి గురైన ఆమె వంటింట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. బాలమ్మ సోదరి చెన్నమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అప్పులు ఎక్కువై..


రాజశేఖర్

పటాన్‌చెరుటౌన్: అప్పులు కావడంతో ఓ వ్యక్తి అదృశ్యమైన సంఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ ఆదివారం వెలుగుచూసింది. ఎస్‌ఐ కిష్టారెడ్డి కథనం ప్రకారం...అమీన్‌పూర్ పరిధిలోని చక్రపురికాలనీ ఎస్‌ఎంఆర్ అపార్ట్‌మెంట్‌లో నివాసముంటున్న కిలారు రాజశేఖర్(57)కు ఇటీవల అప్పులపాలయ్యాడు. దీంతో ఈనెల 21వ తేదీ నుంచి అదృశ్యమయ్యాడు. అతడి భార్యకు ఆపరేషన్ కావడంతో మంచానికే పరిమితమైంది. ఇద్దరు కుమారులు విదేశాలలో ఉన్నారు. రాజశేఖర్ కోసం అదే అపార్ట్‌మెంట్‌లో ఉంటున్న మేనల్లుడు వంశీకృష్ణ స్థానికంగా, తెలిసిన వారిని విచారించినా ఆచూకీ లభించలేదు. మామ రాజశేఖర్ అదృశ్యంపై వంశీకృష్ణ పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సాయిబాబా గుడిలో చోరీ

చిన్నశంకరంపేట(మెదక్): మండల కేంద్రంలోని సాయిబాబా ఆలయంలో ఉన్న హుండీని పగలకొట్టి గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఆదివారం ఉదయం నిత్యపూజలకు వెళ్లిన పూజారి అయ్యవారి వెంకటేశం విషయం గమనించగా, హుండీ తాళం పగలకొట్టి నగదును అపహరించినట్లు గుర్తించారు. చోరీ విషయం పోలీసులకు సమాచారం అందించినట్లు పూజారి వెంకటేశం తెలిపారు.

కుక్కల దాడిలో చిన్నారికి గాయాలు


చిన్నారి చెవికి గాయమైన దృశ్యం

హవేళీఘనపూర్: ఊర కుక్కల దాడిలో ఓ చిన్నారికి గాయాలైన సంఘటన మండల పరిధిలోని తొగిటలో ఆదివారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన మంద రవి కుమార్తె జాస్నవి కిరాణా షాపునకు వెళ్తుండగా 2 కుక్కలు దాడి చేయగా ఒళ్లంతా గాయాలయ్యాయి. వెంటనే కుటుంబీకులు చిన్నారిని చికిత్స నిమిత్తం మెదక్ ఆస్పత్రికి తరలించారు.

చిన్న,సన్నకారు రైతులకు.. ప్రోత్సాహం


హుస్నాబాద్ మండలంలో మామిడి మొక్కలను పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

- ఎస్సీ, ఎస్టీలకూ ప్రాధాన్యం
- 13 రకాల పండ్ల తోటల పెంపకానికి చేయూత
- ఇప్పటికే జిల్లాలో 17వేల ఎకరాల్లో ఉద్యాన సాగు
- ఈ ఏడాది మరో 3 వేల టార్గెట్
- ఈనెలాఖరు వరకు దరఖాస్తుకు అవకాశం

ప్రతి ఏడాదీ వర్షాకాలంలో పండ్ల తోటల పెంపకానికి ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. ఎస్సీ, ఎస్టీ, చిన్న, సన్నకారు రైతులు, పట్టా భూమి ఉన్న ఐదెకరాలు లోపు ఉన్నవారు, ఉపాధి హామీ జాబ్ కార్డున్న రైతులు అర్హులుగా పేర్కొంది. వీరికి నాలుగేళ్ల పాటు నిర్వహణ ఖర్చులు భరించనుంది. తెలంగాణలో వరి సాగు ఎక్కువగా ఉండగా, దీనికి ప్రత్యామ్నాయంగా పండ్ల తోటల పెంపకానికి ప్రభుత్వం నిర్ణయించింది. దీనిపై కథనం..

కోహెడరూరల్(హుస్నాబాద్): ఉద్యాన పంటల విస్తీర్ణాన్ని పెంచేందుకు ప్రభుత్వం సంకల్పించింది. ఇప్పటికే జిల్లాలో 17 వేల ఎకరాల్లో మామిడి, బత్తాయి, డ్రాగన్ ఫ్రూట్‌తోపాటు పండ్ల తోటలున్నాయి. ఇందుకు రైతులకు రాయితీలిచ్చి ప్రోత్సహిస్తోంది. ప్రస్తుతం మరో 3 వేల ఎకరాల్లో ఉద్యాన పంటలు విస్తీర్ణం పెంపే లక్ష్యంగా ఉపాధి పథకంలో హార్టీకల్చర్ ద్వారా 13 రకాలైన మామిడి, నిమ్మ, నారింజ, జీడీ మామడి, ఆమ, సీతాఫలం, సపోట, ఆయిల్‌పామ్, నేరేడు, ఆపిల్ బేర్, దానిమ్మ, మునగ, డ్రాగన్ ఫ్రూట్, కొబ్బరి తోటల పెంపకం చేపట్టనున్నారు. దీనికి ఆర్థిక తోడ్పాటు ప్రభుత్వం నాలుగేళ్లపాటు అందజేస్తోంది. మొక్కల నాటిన దగ్గర నుంచి వాటి సంరక్షణ కింద ఉపాధి పథకం ద్వారా వివిధ రూపాల్లో ఆర్థిక సాయం అందిస్తోంది. అయితే 2022-23లో 2500 వేల ఎకరాలను లక్ష్యం పెట్టుకోగా 2 వేలకు చేరుకున్నారు.

అర్హులు వీరే

పండ్ల తోటల పెంపకానికి ఎస్సీ, ఎస్టీలతోపాటు ఐదు ఎకరాల లోపు ఉన్న చిన్నసన్న రైతులకు అవకాశం కల్పించారు. ఉపాధి పథకం జాబ్‌కార్డు కలిగి ఉన్న రైతులను ఎంపిక చేయనున్నారు. పండ్ల సాగుకు అవసరం అయ్యే డ్రిప్ పరికరాలు ప్రభుత్వం అందిస్తోంది. ఎస్సీ, ఎస్టీలకు 100 శాతం , చిన్న, సన్న కారు రైతులకు 90 శాతం సబ్సిడీ ఇస్తోంది.


హుస్నాబాద్‌లో డ్రాగన్‌ఫ్రూట్ పంటలను పరిశీలిస్తున్న అధికారులు(ఫైల్)

అర్హులు సద్వినియోగం చేసుకోవాలి



పండ్ల తోటల పెంపకానికి అవసరమైన పెట్టుబడి ప్రభుత్వం సమకూరుస్తోంది. 13 రకాల పండ్ల మొక్కల పెంపకానికి అవకాశం ఉంది. ఈనెలాఖరు నాటికి ఎంపిక చేసిన లబ్ధిదారులకు ఆగస్టు ఆఖరి వారంలోగా డ్రిప్ ఇరిగేషన్ పనులు పూర్తి చేసి ఉపాధి పథకం ద్వారా గుంతలు తవ్వి మొక్కలు నాటిస్తాం. ఈ పండ్ల తోటల పెంపకంపై ఆసక్తి ఉన్న అర్హులైన రైతులు సద్వినియోగం చేసుకోవాలి.
– రవళి, హార్టికల్చర్ అధికారి, హుస్నాబాద్

ఈనెల 31లోగా దరఖాస్తు చేసుకోవాలి

ఐదెకరాల లోపు భూమి ఉండి పట్టాదారు పాస్ పుస్తకం, ఉపాధి జాబ్ కార్డు కలిగిన ఉన్న రైతులు ఈ నెల 31 లోగా దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉంది. ఇందుకు పంచాయతీ సెక్రటరీ, ఫీల్డ్ అసిస్టెంట్, ఏపీఓ, ఏఓ, ఏఈఓ, ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ అధికారి, ఎంపీఓ, ఎంపీడీఓతోపాటు తదితర అధికారులు సంప్రదించి పండ్ల తోటల సాగుకు దరఖాస్తు చేసుకోవచ్చు.

అంతర్ పంటలకూ..

పండ్ల తోటలతోపాటు అంతర్ పంటలు వేసుకునే అవకాశం ఉండటంతో రైతులకు రెండు రకాలుగా లాభం పొందొచ్చు. పండ్ల తోటలలో అంతర పంటలుగా పలు ఆకుకూరలు, బీర, సోర, కాకర, చిక్కుడు, టమాటా, పచ్చిమిర్చి, బోడ కాకర, గోరు చిక్కుడు, దోస, మునగ, పూలులాంటి పలు పంటలు సాగుకు ప్రభుత్వం నుంచి ప్రోత్సాహకాలు ఉన్నాయి.

పార్క్ చేసిన బైక్ మాయం

వట్‌పల్లి(అందోల్): పార్క్ చేసిన బైక్‌ను దొంగలు అపహరించుకు వెళ్లారు ఈ సంఘటన జోగిపేట కూరగాయల మార్కెట్లో ఆదివారం జరిగింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం సంత ఉండగా కూరగాయల కొనేందుకు అందోల్ మండలం పోతిరెడ్డిపల్లి వాసి ఆంజనేయులు, జోగిపేట మార్కెట్‌కు వచ్చి తన బైక్ రాములు ప్రింటింగ్ ప్రెస్ దుకాణం ముందు పార్క్ చేశాడు. 15 నిమిషాల్లోనే కూరగాయలు కొని తిరిగి పార్క్ చేసిన చోటుకు రాగా బైక్ కనిపించకపోవడంతో దగ్గరలోనే ఉన్న పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి, జరిగిన విషయం చెప్పి సీసీ పుటేజీలో చూడాలని కోరాడు. సిబ్బంది అందుబాటులో లేరని సోమవారం రావాలని సూచించడంతో తన బైక్‌ను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారని బాధితుడు ఫిర్యాదు చేశాడు. సంత రోజున మార్కెట్‌లో నిఘా ఉంచాలని స్థానికులు కోరుతున్నారు.

బైక్ దగ్ధం

- మల్లాయిపల్లి వార్డులో ఘటన


దగ్ధమైన బైక్

దుబ్బాక: ఆరుబయట నిలిపి ఉంచిన బైక్ కాలిపోయి పూర్తిగా దగ్ధమైంది. ఈ సంఘటన దుబ్బాక మున్సిపాలిటీలోని మల్లాయిపల్లి వార్డులో ఆదివారం తెల్లవారుజాము జరిగింది. స్థానికులు తెలిపిన కథనం ప్రకారం.. ఒకటో వార్డుకు చెందిన కీసరి రాజు జేసీబీ ఆపరేటర్. తన బైక్ రోజు మాదిరిగానే శనివారం రాత్రి ఇంటి ముందు ఎదుట పార్క్ చేశాడు. ఆదివారం తెల్లవారుజాము 3 గంటలకు బైక్ నుంచి మంటలు ఎగసిపడుతుండటాన్ని కుటుంబసభ్యులు గుర్తించారు. అప్రమత్తమైన వారు మంటలు ఆర్పివేశారు. అప్పటికే వాహనం పూర్తిగా దగ్ధమైంది. ఈ ఘటన ప్రమాదవశాత్తు జరిగిందా? లేదా? ఎవరైనా గుర్తుతెలియని వ్యక్తులు కావాలని నిప్పు పెట్టారా? అన్న విషయం తెలియాల్సి ఉంది. దీనిపై పోలీసులను వివరణ కోరగా ఎలాంటి ఫిర్యాదూ అందలేదన్నారు.

పొలంలో దున్నుతుండగా మూర్ఛ

- యువకుడి మృతి


రమేశ్

రామాయంపేట(మెదక్): వ్యవసాయ భూమి దున్నుతున్న క్రమంలో ఫిట్స్‌తో ట్రాక్టర్ నడుపుతున్న యువకుడు మడిలో పడి మృతిచెందాడు. ఈ సంఘటన ఆదివారం మండలంలోని తొనిగండ్లలో జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. తొనిగండ్ల వాసి ఆటిగారి రమేశ్ (30) ట్రాక్టర్ డ్రైవర్. అదే గ్రామస్తుడి పొలం దున్నుతున్న క్రమంలో ఫిట్స్ వచ్చి మడిలోనే పడిపోయాడు. అక్కడికి సమీపంలో ఉన్నవారు గమనించి ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి హైదరాబాద్ తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతుడి కుటుంబానికి మైనంపల్లి ట్రస్ట్ తరపున ప్రజాప్రతినిధులు భూలింగం, బాలక్రిష్ణ, సభ్యులు ఆర్థికసాయం అందజేశారు.

విద్యుత్ షాక్‌తో పాడి గేదెలు మృతి

మిరుదొడ్డి/చేర్యాల: విద్యుత్ షాక్‌తో పాడి గేదె మృతిచెందిన సంఘటన మండల పరిధిలోని ధర్మారంలో ఆదివారం జరిగింది. గ్రామానికి చెందిన బాధితుడు గూళ్ళ చంద్రయ్య తెలిపిన వివరాలు.. పాడి గేదె తన వ్యవసాయ పొలం వద్ద ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ దగ్గర గడ్డి మేస్తున్న క్రమంలో విద్యుత్ షాక్ తగిలి మృత్యువాత పడిందని విలపించాడు. సుమారు రూ.70వేల ఆస్తినష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశాడు.

చేర్యాలలో..

విద్యుత్ షాక్‌కు గురై పాడి గేదె మృతి చెందిన ఘటన మండల పరిధిలోని నాగపురి గ్రామంలో ఆదివారం ఉదయం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గొట్టం చంద్రశేఖర్‌రెడ్డి పాడి గేదె ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందింది. సుమారు రూ.80వేల నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు వాపోయాడు.

కాటేసిన కరెంట్ తీగ

- ఫెన్సింగ్ వైర్‌కు విద్యుత్ సరఫరా.. కౌలురైతు మృతి


పెంటయ్య (ఫైల్)

శివ్వంపేట(నర్సాపూర్): పంట చూసేందుకు వెళ్లిన కౌలు రైతు విద్యుత్ షాక్ గురై మృతిచెందాడు. ఈ సంఘటన మండల పరిధిలోని పెద్దగొట్టిముక్కలో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కుమ్మరి పెంటయ్య (35) తనకున్న 2 ఎకరాలతోపాటు మరో 3 ఎకరాలు కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నాడు. కౌలు భూమి చుట్టూ ఫెన్సింగ్ వైరు ఏర్పాటైంది. కరెంట్ స్తంభం నుంచి వైరు తెగిపడి ఫెన్సింగ్‌పై పడింది. పంట పరిశీలనకు ఒక వైపు నుంచి వెళ్లి మరో వైపు నుంచి తిరిగొస్తుండగా ఫెన్సింగ్ వైర్ తగిలి షాక్‌తో అక్కడికక్కడ మరణించాడు. అతడికి భార్య నాగమణి, ఇద్దరు పిల్లలున్నారు. నాగమణి ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నర్సాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అయితే వ్యవసాయ పొలాల వద్ద వేళాడుతున్న విద్యుత్ వైర్లు సరిచేయడంలో సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపిస్తూ రైతులు ఆందోళన నిర్వహించారు. సంఘటనా స్థలం వద్దకొచ్చిన లైన్‌మెన్, ఇద్దరు సిబ్బందిని గేరావ్ చేశారు. ఉన్నతాధికారులు పరిహారం ప్రకటించేంతవరకు మృతదేహాన్ని ఇక్కడి నుంచి తరలించడానికి వీల్లేదని భీష్మించారు. పోలీసులు జోక్యం చేసుకొని నచ్చజెప్పి శాంతింపజేశారు.


సంఘటనా స్థలం వద్ద వివరాలు సేకరిస్తున్న పోలీసులు

అదృశ్యం.. శవమై ప్రత్యక్షం

- వారం క్రితమే నోటిక్యాన్సర్ ఆపరేషన్


బండి రాజయ్య

దుబ్బాకటౌన్: ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన రైతు 5 రోజుల తర్వాత పెద్దచెరువులో ఆదివారం శవమై తేలాడు. స్టేషన్ హౌజ్ ఆఫీసర్ బత్తుల మహేందర్ కథనం ప్రకారం.. పట్టణానికి చెందిన రైతు రాజయ్య(53)కు నోటి క్యాన్సర్ బాధితుడు. వారం రోజుల క్రితమే హైదరాబాద్‌లోని ఆస్పత్రిలో ఆపరేషన్ జరిగింది. ఈ క్రమంలో ఇంటికి వచ్చాక రాజయ్య బుధవారం రాత్రి ఇంట్లో నుంచి కల్లు తాగి వస్తానని బయటకు వెళ్లి వెనక్కి రాలేదు. కుటుంబ సభ్యులు ఎంతగా గాలించిన ఆచూకీ లభించలేదు. శనివారం రాజయ్య 4 రోజులుగా కనిపించడం లేదని కుటుంబసభ్యులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆదివారం ఉదయం పట్టణంలోని పెద్ద చెరువులో శవమై తేలాడు. నోటి క్యాన్సర్ బాధను భరించలేకే చెరువులో పడి ఉంటాడని కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

తాళం వేసిన ఇళ్లే టార్గెట్

- ఆరు ఇళ్లల్లో చోరీ
- వెండి, బంగారం అపహరణ
- మిర్జాపల్లిలో ఘటన


శ్రీకాంత్‌గౌడ్ ఇంట్లో విచారిస్తున్న పోలీసులు


బాధితుడు కిష్టయ్య

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని మిర్జాపల్లిలో శనివారం అర్ధరాత్రి తాళం వేసిన ఆరు ఇళ్లల్లో గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. వెండి, బంగారంతోపాటు కోళ్లు ఎత్తుకెళ్లారు. చిన్నశంకరంపేట ఎస్‌ఐ సుభాష్‌గౌడ్ కథనం మేరకు... మిర్జాపల్లిలోని శ్రీకాంత్‌గౌడ్ ఇంట్లో దొంగలు పడ్డారు. అర తులం బంగారపు ఉంగరం, 20 తులాల వెండి పట్టాగొలుసులు, రూ.5 వేల నగదు అపహరించారు. అలాగే సంగని శ్రీనివాస్, తాళ్ల శేఖర్‌గౌడ్, గడ్డమీది ముత్యాలు, కాయితి చంద్రయ్యకు చెందిన ఇళ్ల తాళాలు పగలగొట్టి చోరీకి విఫలయత్నం చేశారు. పారిపోతూ చింతల కిష్టయ్యకు చెందిన మూడు కోళ్లు ఎత్తుకెళ్లారు. ఆ సమయంలో వీరి కుటుంబసభ్యులు నిద్రిస్తున్నారు. మెదక్ క్లూజ్ టీం బాధితుల ఆరు ఇళ్లను పరిశీలించింది. పోలీసులు కేసులు దర్యాప్తు చేస్తున్నారు.

శుభకార్యానికి వెళ్లి వస్తూ..

- రోడ్డు ప్రమాదంలో చేగుంట వాసి మృతి
- పలువురికి గాయాలు


శ్రీకాంత్‌రెడ్డి

మాచారెడ్డి: శుభకార్యానికి వెళ్లొస్తూ జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందారు. పలువురికి గాయపడ్డారు. ఈ ఘటన ఆదివారం కామారెడ్డి జిల్లా పాల్వంచ మండలం ఆరేపల్లి శివారులో చోటుచేసుకుంది. మాచారెడ్డి ఎస్సై రాజారాం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మెదక్ జిల్లా చేగుంట మండలం బోనాలకు చెందిన అల్లి శ్రీకాంత్‌రెడ్డి(35) కొన్నేళ్లుగా కామారెడ్డిలో కార్ డెకార్స్ నడుపుతున్నాడు. హౌసింగ్ బోర్డు కాలనీలో భార్య, పిల్లలతో కలిసి నివాసముంటున్నాడు. ఆయన తన ఇద్దరు మిత్రులతో కలిసి కారులో ఫరీదుపేటలో జరిగిన ఓ శుభ కార్యానికి హాజరై కామారెడ్డి వెళ్తున్నాడు. ఆరేపల్లి శివారులో ఎదురుగా వస్తున్న టాటా మ్యాజిక్ వాహనం, వీరి కారును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శ్రీకాంత్‌రెడ్డి అక్కడికక్కడే మృతిచెందాడు. కారులో ఉన్న మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. అలాగే టాటా మ్యాజిక్ వాహనంలో ప్రయాణిస్తున్న ఆరుగురికి తీవ్రగాయాలు కాగా 108 అంబులెన్స్‌లో కామారెడ్డి జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య భాగ్యరేఖ, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కేసు నమోదు చేసుకొన్నామని ఎస్సై తెలిపారు.

రెండు కార్లు ఢీ..


ప్రమాద స్థలంలో ఆల్టో కారు

చిన్నశంకరంపేట(మెదక్): ఎదురెదురుగా వస్తున్న రెండు కార్లు ఢీకొని పలువురికి గాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని ఎస్.కొండాపూర్ శివారులో ఉన్న ఏడిప్పల్ వద్ద చోటుచేసుకుంది. ఆదివారం రాత్రి చిన్నశంకరంపేట నుంచి మెదక్ వైపునకు వస్తున్న ఆల్టో కారును మెదక్ నుంచి చిన్నశంకరంపేట వైపు వెళుతున్న బ్రెజా కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కొమ్రెల్లి దైవదర్శనానికి వెళ్లి ఆల్టో కారులో తిరిగొస్తున్న రాజ్‌పల్లికి చెందిన నలుగురికి గాయాలయ్యాయి. వీరిని మెదక్ ఆస్పత్రికి తరలించారు. కాగా బ్రెజా కారు బెలూన్‌లు ఓపెన్ కావడంతో అందులో ప్రయాణిస్తున్నవారు స్వల్పగాయాలతో బయటపడ్డారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. రోడ్డుపై అడ్డుగా ఉన్న కార్లను పక్కకు జరిపి ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా చేశారు.


ఘటనా స్థలంలో క్షతగాత్రులు

బొలేరో బోల్తా నలుగురికి గాయాలు

అల్లాదుర్గం(మెదక్): బొలేరో అదుపు తప్పి బోల్తా పడిన ఘటన చిల్వెర గ్రామశివారులో ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. అల్లాదుర్గం నుంచి జోగిపేట వైపు వస్తున్న బొలేరో.. చిల్వెర గ్రామ శివారులో అదుపు తప్పి రోడ్డు దిగువకు దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో వాహనంలో ఉన్న దుర్గేశ్, పుష్ప, నర్సింలు, రీగన్‌కు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను హైవే అంబులెన్స్‌లో జోగిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ సంఘటనపై ఎలాంటి ఫిర్యాదూ అందలేదని ఎస్‌ఐ ప్రవీణ్‌రెడ్డి తెలిపారు.


క్షతగాత్రులకు చికిత్స చేస్తున్న అంబులెన్స్ సిబ్బంది

అదుపు తప్పిన బైక్ గీత కార్మికుడి మృతి


గణేశ్ మృతదేహం

సిద్దిపేటకమాన్: కాళ్లకుంట కాలనీ బైపాస్ క్రాసింగ్ వద్ద బైక్ అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న గుంతలో పడి గీత కార్మికుడు మృతిచెందాడు. ఈ సంఘటన సిద్దిపేట వన్ టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. సిద్దిపేట వన్ టౌన్ సీఐ కథనం ప్రకారం.. మండలంలోని బూర్గుపల్లి రాంచంద్రనగర్ వాసి అంబటి గణేష్ (45) గీత కార్మికుడిగా పని చేసుకునేవాడు. రోజులానే కల్లు పెట్టెలతో తన బైక్‌పై బూర్గుపల్లి నుంచి చిన్నకోడూరుకు వెళ్తుండగా మార్గమధ్యలో కాళ్లకుంట కాలనీ బైపాస్ క్రాసింగ్ వద్ద బైక్ అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న గుంతలో పడిపోయాడు. తలకు బలమైన గాయాలతో ఉన్న అతడిని స్థానికులు గుర్తించి 108 సిబ్బందికి సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న సిబ్బంది, క్షతగాత్రుడిని పరిశీలించి అప్పటికే మృతిచెందినట్లు తెలిపింది. మృతదేహాన్ని సిద్దిపేట ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రైవేటు బస్సులో పట్టుబడిన గోవా మద్యం

- 26 బాటిల్స్ స్వాధీనం


ఎక్సైజ్ అధికారులు పట్టుకున్న గోవా మద్యం

జహీరాబాద్ టౌన్: అక్రమంగా తరలిస్తున్న గోవా మద్యాన్ని ఎక్సైజ్ అధికారులు పట్టుకున్నారు. మండలంలోని చిరాగ్‌పల్లి, మాడ్గి సరిహద్దు చెక్‌పోస్టు వద్ద ఆదివారం ప్రొహిబిషన్ ఎక్సైజ్ అధికారులు వాహన తనిఖీలు నిర్వహించారు. ముఖ్యంగా ట్రావెల్స్ బస్సులను తనిఖీలు చేయగా గోవా నుంచి హైదరాబాద్‌కొస్తున్న ఓ బస్సులో 18.36 లీటర్లు (26 బాటిల్స్) లభించాయి.బాటిల్స్ స్వాధీనం చేసుకుని అధికారులు కేసు నమోదు చేశారు. తనిఖీలో జహీరాబాద్ సీఐ. అశోక్ కుమార్, మెదక్ ఎన్‌ఫోర్స్‌మెంట్, సంగారెడ్డి డీటీఎఫ్ సిబ్బంది పాల్గొంది.

246 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

పటాన్‌చెరు టౌన్: అక్రమంగా తరలిస్తున్న 246 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని ముత్తంగి టోల్ గేట్ వద్ద పోలీసులు, పౌరసరఫరా అధికారుల ఆదివారం పట్టుకున్నారు. వారి కథనం ప్రకారం... హైదరాబాద్ పరిసర ప్రాంతాల నుంచి సేకరించిన రేషన్ బియ్యాన్ని మహారాష్ట్ర- నాందేడ్ జిల్లాకు అక్రమంగా తరలిస్తున్నారని విశ్వసనీయ సమాచారం మేరకు పటాన్‌చెరు మండలంలోని ముత్తంగి టోల్ గేట్ వద్ద అధికారులు వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలో లారీలో తరలిస్తున్న 525 బ్యాగులు బియ్యం సంచులు, సుమారు 246 క్వింటాళ్ల రేషన్ రైస్‌ను అధికారులు గుర్తించారు. ఆ మేరకు లారీని సీజ్ చేసి, రేషన్ బియ్యాన్ని పటాన్‌చెరు పౌరసరఫరా గోదాంకు తరలించారు. డీటీ విష్ణువర్ధన్ ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ పవన్, కేసు దర్యాప్తు చేస్తున్నారు. కాగా రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న లారీ యజమాని సలీం, లారీ డ్రైవర్ మహబూబ్ లాలా ఇద్దరూ హైదరాబాద్ చుట్టుపరిసర ప్రాంతాల నుంచి బియ్యాన్ని సేకరించి విక్రయిస్తున్నట్లు విచారణలో తెలిసింది.

క్లుప్తంగా

ఆర్థికసాయం

మద్దూరు(హుస్నాబాద్): ఆపదలో ఉన్నవారికి బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నాగపూరి కిరణ్‌కుమార్ అండగా నిలుస్తూ మనోధైర్యం కల్పిస్తున్నాడు. ఐదురోజులుగా కురుస్తున్న వానలకు మండలంలోని రేబర్తి గ్రామానికి చెందిన కూకట్ల నర్సవ్వ, అందే ఎల్లవ్వల ఇళ్లు కూలిపోయాయి. దీంతో విషయం తెలుసుకున్న నాగపూరి కిరణ్ ఆదివారం బాధిత కుటుంబాల వద్దకు వెళ్లి ఓదార్చి, ఒక్కో కుటుంబానికి రూ.5వేల చొప్పున ఆర్థికసాయం అందజేశారు.

సంస్కృతి, సంప్రదాయాలకు పెద్దపీట



బోనాల ఊరేగింపులో ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి తదితరులు

గజ్వేల్: సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. ఆదివారం తన సొంత గ్రామమైన గజ్వేల్ మండలం బూర్గుపల్లిలో నిర్వహించిన బోనాల ఉత్సవాల్లో ఆయన పాల్గొని గ్రామదేవతలకు పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ కృషితో పండగలకు ప్రాధాన్యత లభించిందన్నారు. కాగా గ్రామంలో బోనాల ఊరేగింపు, పోతరాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలు విశేషంగా ఆకట్టుకున్నాయి.

సన్మానం



ఏసీపీని సన్మానిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

దుబ్బాకరూరల్: సిద్దిపేట ఏసీపీగా బాధ్యతలు స్వీకరించిన సురేందర్‌రెడ్డిని బీఆర్ఎస్ నాయకులు శాలువా కప్పి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో అక్బర్‌పేట-భూంపల్లి బీఆర్ఎస్ అధ్యక్షుడు జీడిపల్లి రవి, పీఏసీఎస్ చైర్మన్ కైలాష్, సర్పంచ్ రాజయ్య, ఎల్లారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

జగదేవ్‌పూర్(గజ్వేల్): జగదేవ్‌పూర్ ఎస్ఐ కృష్ణమూర్తి సీఐగా పదోన్నతి పొందడంతో ఆదివారం తిగుల్, పలుగుగడ్డ, ఇటిక్యాల రజక సంఘం నాయకులు కృష్ణమూర్తిని కలిసి శాలువాలు కప్పి సన్మానించి అభినందించారు. మరిన్ని పదవులు పొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నాయకులు అశోక్, ఎల్లారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, భూమయ్య, ఐలయ్య, సీతయ్య, శ్రీనివాస్ ఏల్లేష్, రవి, అయూబ్, రాములు, దాసు, నర్సింలు, బాల్‌నర్సయ్య, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం



స్తంభం ఒరగడంతో నేలవాలిన కరెంట్ వైర్లు

దుబ్బాక: ఇటీవల కురిసిన వర్షాలకు దుబ్బాక నుంచి మల్లాయపల్లికి వెళ్లే మార్గంలో పట్టణానికి చెందిన బద్దిపడిగ ఎల్లారెడ్డి పొలం వద్ద కరెంట్ స్తంభం ఒరిగి కరెంట్ వైర్లు నేలవాలాయి. అది గమనించిన స్థానిక రైతులు విద్యుత్ సరఫరాను నిలిపి వేసి విద్యుత్ అధికారులకు సమాచారం అందించారు. ఘటన జరిగి మూడు రోజులవుతున్నా సంబంధిత అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం పట్ల రైతులు తీవ్ర ఆగ్రహానికి గురవుతున్నారు. పెద్ద ప్రమాదం జరగక ముందే ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

బీటీరోడ్డు నిర్మించాలి

అక్కన్నపేట(హుస్నాబాద్): గిరిజన తండాల్లో బీటీరోడ్లు నిర్మించాలని నిరసిస్తూ తండావాసులతో కలిసి బీజేపీ గిరిజన మోర్చా మండల అధ్యక్షుడు భానోతు అనిల్‌నాయక్ ఆదివారం గండిపల్లి గ్రామ పరిధిలోని అంబనాయక్‌తండాలో ధర్నా చేపట్టారు. రోడ్డుపై బైటాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వాతంత్ర్యం వచ్చి ఏళ్లు గడుస్తున్నా నేటికీ గిరిజన తండాల్లో రోడ్డు సౌకర్యం లేకపోవడం బాధాకరమన్నారు. గిరిజన తండాల్లో వర్షం వస్తే చాలు రోడ్లన్నీ బురదమయంగా మారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ పంచాయతీ పరిధిలోని పంచరాయితండా, అంబనాయక్‌తండా, సరిరాంతండా, బోరింగ్‌తండాలకు తక్షణమే బీటీరోడ్డు నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. సరైన రోడ్డు వసతులు లేకపోవడంతో ఎంతోమంది యువకులు చదువుకు దూరమవుతున్నారన్నారు. అధ్వానంగా తయారైన మట్టిరోడ్డుపై నుంచి రాత్రిపూట ప్రయాణించాలంటే అనేక ఇబ్బందులు పడాల్సిన పరిస్థితులు దాపురించాయన్నారు. కార్యక్రమంలో తండావాసులు, యువకులు పాల్గొన్నారు.

ఆహ్లాదకరం.. ప్రకృతి వనం



గండిపల్లి గ్రామ పల్లె ప్రకృతి వనం



ప్రకృతి వనంలో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్

- పచ్చదనంతో కళకళలాడుతున్న పార్కు
- ఊయలలు, ఆట పరికరాలతో ఆకట్టుకుంటున్న వైనం
- సేదతీరుతున్న గ్రామస్తులు

అక్కన్నపేట(హుస్నాబాద్): పర్యావరణ పరిరక్షణకు ప్రభుత్వం చేపట్టిన హరితహారం కార్యక్రమం సత్ఫాలితాలు ఇస్తున్నది. పట్టణాల్లో పార్కుల మాదిరిగా పల్లెల్లోనూ ప్రకృతి వనాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం సంకల్పించి ఊరూరా ఏర్పాటు చేయించింది. కొత్త పంచాయతీరాజ్ చట్టంలో పేర్కొన్నట్లు పంచాయతీలకు కేటాయించిన నిధుల్లో గ్రీన్ బడ్జెట్ కింద ఖర్చు చేసే 10శాతం నిధులను వీటికి ఉపయోగించారు. ఆహ్లాదంగా తీర్చిదిద్దేందుకు పంచాయతీల్లో నిధులు ఖర్చు చేశారు. ఫలితంగా గ్రామాల్లో ప్రకృతి వనాలు పచ్చగా దర్శనమిస్తూ కనువిందు చేస్తున్నాయి. అక్కన్నపేట మండలం గండిపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనం పచ్చదనంతో కళకళలాడుతోంది. పార్కును తలపించే ప్రకృతి వనంలో చిన్నారులు ఆడుకునేలా వస్తువులు, కూర్చునే బెంచీలు, తదితర ఏర్పాట్లు కూడా చేశారు. దీనికి తోడుగా ఓపెన్ జిమ్‌ను సైతం ఏర్పాటు చేశారు. దీంతో ఉదయం, సాయంత్రం సమయాల్లో చిన్నాపెద్ద అనేతేడా లేకుండా ప్రకృతి వనంలో సేద తీరుతున్నారు. అదేవిధంగా నాటిన మొక్కలు పెరిగి నీడను ఇస్తున్నాయి. ప్రకృతి వనంలో పూలచెట్లు చూపరులను ఆకర్షిస్తున్నాయి. దాదాపుగా రెండేళ్ల క్రితం నాటిన పూలు, పండ్ల మొక్కలు ఏపుగా పెరిగాయి. పక్షుల కిలకిల రాగాలు, చల్లని గాలులతో ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పడడంతో సేదదీరేందుకు అనువుగా ఉందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

హుస్నాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత



టైర్లలో ఉన్న నీటిని పారబోస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత

హుస్నాబాద్: ఇంటి చుట్టూ ఉన్న పరిసర ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండకుండా శుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత అన్నారు. ఆదివారం పట్టణంలోని 18వ వార్డులో 10 గంటల 10 నిమిషాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజలందరూ తమ ఇంట్లో ఉన్న కూలర్, పాత టైర్లు, పాత బకెట్లలో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నీటి నిల్వతో దోమలు వ్యాపించి మలేరియా, టైఫాయిడ్, డెంగీ జ్వరాలతో అనారోగ్యాలకు గురవుతారన్నారు. వారంలో ప్రతీ ఆదివారం నిల్వ ఉన్న నీటిని పారబోయడంతో దోమలను నియంత్రించవచ్చన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనిత, కౌన్సిలర్ మిర్యాల రమేశ్, మాజీ ఎంపీపీ ఆకుల వెంకట్, కో-ఆప్షన్ సభ్యుడు అయూబ్, ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ శంకర్, ఎన్విరాన్మెంట్ ఇంజినీర్ రవికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాయామంతో సంపూర్ణ ఆరోగ్యం



యువకులకు బహుమతులు అందిస్తున్న సీఐ కృష్ణ

దుబ్బాక: వ్యాయామం, రన్నింగ్, యోగాతో సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని దుబ్బాక సీఐ మున్నూరు కృష్ణ అన్నారు. ఆదివారం దుబ్బాక మున్సిపల్ పరిధిలోని దుంపలపల్లి నుంచి దుబ్బాక వరకు తిరిగి దుబ్బాక నుంచి దుంపలపల్లి వరకు దుబ్బాక పోలీస్ శాఖ ఆధ్వర్యంలో 10కే రన్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీలను దుబ్బాక సీఐ మున్నూరు కృష్ణ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మారుతున్న కాలంలో మనం ఆరోగ్యంపై శ్రద్ధ వహించడం ఎంతైనా అవసరమన్నారు. ఆగస్టు 6వ తేదీన మంత్రి హరీశ్‌రావు, జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సిద్దిపేట పట్టణంలోని రంగనాయకసాగర్ వద్ద నిర్వహించే హాఫ్ మారథాన్ పోటీల్లో యువకులు అధిక సంఖ్యలో పాల్గొని తమ సత్తా చాటాలని కోరారు. అనంతరం 10కే రన్ పోటీల్లో గెలుపొందిన యువకులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో దుంపలపల్లి కౌన్సిలర్ ఇల్లందుల శ్రీనివాస్, పీఈటీ షాదుల్, యువకులు అధికం రాజ్‌గౌడ్ , హరీశ్, నరేశ్ తదితరులున్నారు.

కార్మికుల హక్కుల పరిరక్షణకు పోరాటాలు



రాణే పరిశ్రమ వద్ద బీఎంఎస్ జెండాను ఆవిష్కరిస్తున్న యూనియన్ నాయకులు

గజ్వేల్: కార్మికుల హక్కుల పరిరక్షణకు బీఎంఎస్(భారతీయ మజ్దూర్ సంఘ్) నిరంతర పోరాటాలను కొనసాగిస్తోందని ఆ యూనియన్ రాణే పరిశ్రమ శాఖ ప్రధాన కార్యదర్శి శ్రీశైలం, వర్కింగ్ ప్రెసిడెంట్ సల్ల శ్రీనివాస్‌లు అన్నారు. ఆదివారం గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని రాణే ఫ్యాక్టరీలో బీఎంఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఈ వారు మాట్లాడుతూ.. ఎన్నో పోరాటాల ఫలితంగా కార్మికుల సమస్యలను పరిష్కరించుకోగలిగామని, ఇదే స్ఫూర్తితో ముందుకు సాగుతామన్నారు. అంతకుముందు యూనియన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి కిష్టయ్య జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు నజీర్, రాములు, యాదగిరి, పరశురామ్, దేవయ్య, భాస్కర్, మల్లయ్య, రంగయ్య, ఇమాముద్దీన్ తదితరులు పాల్గొన్నారు.


ఆజాద్‌ను ఆదర్శంగా తీసుకోవాలి



సబ్బు బిళ్లపై ఆజాద్ రూపం

గజ్వేల్‌రూరల్: స్వాతంత్ర్య సమర యోధుడు చంద్రశేఖర్ ఆజాద్‌ను ఆదర్శంగా తీసుకొని సమస్యల పరిష్కారానికి పోరాటం సాగించాలని రామకోటి భక్తసమాజం వ్యవస్థాపక అధ్యక్షుడు రామకోటి రామ రాజు పేర్కొన్నారు. చంద్రశేఖర్ ఆజాద్ 117వ జయంతి సందర్భంగా గజ్వేల్ పట్టణంలో సబ్బు బిళ్ల పై ఆయన రూపాన్ని చిత్రించి నివాళులర్పించారు.

పండ్ల తోటలతో అదనపు ఆదాయం



గాంధీనగర్‌లో కొబ్బరి మొక్కలను పెంచుతున్న రైతు మురళీధర్‌రావు

హుస్నాబాద్‌రూరల్: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పండ్ల తోటల పెంపకానికి అవకాశం ఉందని, సన్న, చిన్నకారు రైతులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ కుమారస్వామి ఆదివారం తెలిపారు. గతం కంటే మెరుగైన పండ్ల తోటలు, పొలాల గట్లపై కొబ్బరి మొక్కల పెంపకంతో పాటు, డ్రాగన్ ఫ్రూట్స్, ఫిల్ బేరు, అల్లరేగడి, మునగ తోటల పెంపకానికి ఉపాధిహామీలో ప్రభుత్వం అవకాశం కల్పించినట్లు చెప్పారు. మార్కెటింగ్ గల డ్రాగన్ ఫ్రూట్, ఆపిల్ బేరు, కొబ్బరి మొక్కలను పెంచితే రైతులకు పంటల దిగుబడులకు తోడు అదనపు ఆదాయం వస్తుందన్నారు. తోటలు పెంచే రైతులకు బిందు సేద్యం కోసం డ్రిప్ పరికరాలను కూడా సబ్సిడీపై అందిస్తారని చెప్పారు. ఆసక్తి గల రైతులు గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఫీల్డ్ అసిస్టెంట్లను సంప్రదించాలన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ పంట నష్టపరిహారం చెల్లించాలి

చిన్నకోడూరు(సిద్దిపేట): యాసంగిలో అకాల వర్షాలతో పంటలకు నష్టం వాటిల్లితే ఎకరాకు రూ.10వేల నష్టపరిహారం ప్రకటించిన ప్రభుత్వం ఇంకెప్పుడిస్తారని కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు డా. సూర్యవర్మ ప్రశ్నించారు. ఆదివారం ఆయన చిన్నకోడూరులో మాట్లాడుతూ.. వానాకాలం నాట్లు మొదలైన యాసంగిలో దెబ్బతిన్న పంటలకు ఇంకా పరిహారం చెల్లించకపోవడం ప్రభుత్వానికి రైతులపై ఉన్న ప్రేమ అర్థమవుతుందన్నారు. రైతుల పక్షాన కాంగ్రెస్ పోరాడుతుందన్నారు. ఆయన వెంట నాయకులు చిరంజీవి, ఎల్లం , దిలీప్, వెంకట్, ప్రసాద్ తదితరులు ఉన్నారు.

◆ కేసీఆర్ పాలనలో సంక్షేమం కొత్త పుంతలు

గజ్వేల్: సీఎం కేసీఆర్ పాలనలో సంక్షేమం కొత్త పుంతలు తొక్కుతోందని గజ్వేల్ మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ అన్నారు. ఆదివారం గజ్వేల్‌లోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. రాష్ట్రంలోని అన్ని వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. పింఛన్ పెంపుతో దివ్యాంగుల్లో ఆత్మస్థైర్యం పెరుగుతుందన్నారు. స్వరాష్ట్రంగా అవతరించిన తొమ్మిదేళ్లలో తెలంగాణ నేడు దేశంలోనే అన్ని రంగాలకు అగ్రగామిగా ఆవిర్భవించిందని అభిప్రాయపడ్డారు. సమావేశంలో నాయకులు కల్యాణ్‌కర్ నర్సింగరావు, శివకుమార్, బాబు, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

◆ రెవెన్యూ డివిజన్ జేఏసీ అర్జునపట్ల గ్రామ కమిటీ ఎన్నిక

చేర్యాల(సిద్దిపేట): చేర్యాల రెవెన్యూ డివిజన్ సాధనకు చేస్తున్న ఉద్యమంలో భాగంగా 4 మండలాల పరిధిలోని గ్రామాల్లో జేఏసీ గ్రామ కమిటీల ఎన్నికను మండల జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా ఆదివారం మండల పరిధిలోని అర్జునపట్ల గ్రామ జేఏసీ కమిటీ ఎన్నిక మండల కన్వీనర్ బొమ్మగాని అంజయ్య ఆధ్వర్యంలో జరిగింది. ఎన్నికలో కన్వీనర్‌గా సింగపాక కనకయ్య, కో-కన్వీనర్లుగా భీంరెడ్డి జగ్గారెడ్డి, పొన్నం మల్లేశం, చోటేమియా, కార్యదర్శిగా సింగపాక కుమార్, సహాయ కార్యదర్శిగా తాళ్లపల్లి నర్సింహులు, తిరుచయ్య, లింగాల బాలయ్య, బైతి శ్రీశైలం, కోశాధికారిగా గొల్లపల్లి చంద్రమౌళి, కార్యవర్గ సభ్యులుగా రహీం, రాజు, రవీందర్‌రెడ్డి, రాంచంద్రం, శ్రీనివాస్, వెంకటయ్య, కనకయ్య, లింగం, శ్రీకాంత్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

◆ డైట్ చార్జీల పెంపుపై హర్షం

గజ్వేల్‌రూరల్: హాస్టల్, గురుకుల విద్యార్థులకు ప్రభుత్వం డైట్ చార్జీలను పెంచడంపై హర్షం వ్యక్తం చేస్తున్నట్లు డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ పేర్కొన్నారు. ఆదివారం గజ్వేల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈ విద్యాసంవత్సరం నుంచి డైట్ చార్జీలను పెంచి ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకుందని, అదే విధంగా కాస్మోటిక్ చార్జీలను సైతం పెంచాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో డీబీఎఫ్ నాయకులు ఏగొండస్వామి తదితరులు పాల్గొన్నారు.

◆ నియామకం

బెజ్జంకి(సిద్దిపేట): అఖిల భారత యాదవ మహాసభ జిల్లా ఉపాధ్యక్షుడిగా బెజ్జంకి మండల కేంద్రానికి చెందిన దొంతరవేణి శ్రీనివాస్‌యాదవ్, జిల్లా కార్యదర్శిగా వడ్లూరి గ్రామానికి చెందిన అమ్ముల ఓదయ్య యాదవ్‌లను నియమించారు. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఉమ్మడి మెదక్ జిల్లా గొర్రెల పెంపకదారుల సహకార సంఘం చైర్మన్ పోచబోయిన శ్రీహరియాదవ్, అఖిల భారత యాదవ మహాసభ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు మామిండ్ల ఐలయ్య యాదవ్‌లు ఆదివారం నియామకపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో యాదవ సంఘం మండల అధ్యక్షుడు మ్యాకల శ్రీకాంత్‌యాదవ్, జిల్లా నాయకులు రొడ్డ మల్లేశం యాదవ్, రవియాదవ్, అమ్ముల రాముయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

◆ గుండెపోటుతో ఆర్టీసీ కండక్టర్ మృతి

దుబ్బాకటౌన్: దుబ్బాక బస్ డిపోలో కండక్టర్(8017754)గా పనిచేస్తున్న ఎల్.నీరజారెడ్డి గుండెపోటుతో శనివారం రాత్రి మృతి చెందారు. నీరజారెడ్డి ఆరోగ్యం బాగాలేకపోవడంతో కుటుంబ సభ్యులు సికింద్రాబాద్ యశోద ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఈ క్రమంలోనే ఆస్పత్రిలోనే గుండెపోటు వచ్చి నీరజారెడ్డి మృతి చెందారు. మృతదేహాన్ని ఆదివారం తెల్లవారుజామున దుబ్బాకకు తీసుకొచ్చారు. నీరజారెడ్డి అంత్యక్రియల్లో ఆర్టీసీ కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని ఆమెకు నివాళులర్పించారు.

◆ కుల సంఘాల అభివృద్ధే ధ్యేయం

సిద్దిపేటకమాన్: సిద్దిపేటలో కుమ్మరి సంఘానికి రెండు ఎకరాల స్థలాన్ని కేటాయించడంతో పాటు, నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో కుల సంఘాలకు స్థలాలు కేటాయించిన ఘనత మంత్రి హరీశ్‌రావుదే అని కుమ్మరి సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ అన్నారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం మాట్లాడుతూ.. సిద్దిపేటలో కుమ్మరి కులస్తులకు మంత్రి హరీశ్‌రావు చేసిన అభివృద్ధిని చూసి తట్టుకోలేక కొంత మంది కులాన్ని విచ్ఛిన్నం చేసే ప్రయత్నం చేస్తున్నారన్నారు. రాష్ట్ర నాయకత్వం నుంచి ఆదేశాలు లేకుండా జిల్లా కమిటీని రద్దు చేయరాదని, ప్రస్తుతం ఉన్న కమిటీనే కొనసాగుతుందన్నారు. సమావేశంలో నర్సింలు, శ్రీనివాస్, విజయ్, రవిందర్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

మైసమ్మ ఆశీస్సులు అందరిపై ఉండాలి

ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు



అమ్మవారికి మొక్కులు చెల్లిస్తున్న మంత్రి హరీశ్‌రావు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పట్టణంలో లాల్‌కమాన్ గడి మైసమ్మ బోనాల ఉత్సవాలు ఆదివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. వైశ్యులు అమ్మవారికి బోనాలను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. మహిళలు ఏకరూప దుస్తులు ధరించి నిర్వహించిన బోనాల ఊరేగింపు కనుల పండువగా కొనసాగింది. ఈ ఉత్సవాల్లో మంత్రి హరీశ్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. మైసమ్మ ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ప్రార్థించినట్లు తెలిపారు.

శరభేశ్వర ఆలయ పాలకవర్గ ప్రమాణస్వీకారం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పట్టణంలోని ప్రాచీన శైవ క్షేత్రం శరభేశ్వర ఆలయ నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారోత్సవం ఆదివారం జరిగింది. ఆలయ శాశ్వత చైర్మన్ రాజేశ్వరశర్మ, సభ్యులుగా ఎల్లేశం, నాగరాజు, అనిత, నాగరాజు, బేజుగాం మల్లేశం, చింత చందులు ప్రమాణస్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి హరీశ్‌రావు హాజరయ్యారు. ఆలయ అర్చకులు మంత్రికి ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో మంత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

బసవేశ్వరుని జీవితం ఆదర్శం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): బసవేశ్వరుని జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని అందరూ ముందుకు సాగాలని మంత్రి హరీశ్‌రావు అన్నారు. పట్టణంలోని రెడ్డి ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన వీరశైవ బలిజ సమాజ సమావేశంలో జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్‌తో కలిసి మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా బసవేశ్వరుడి విగ్రహానికి పూలమాలలు వేశారు. అంతకుముందు సిద్దిపేట నియోజకవర్గ వీరశైవ బలిజ సమాజం ఓటు మంత్రికే అని తీర్మానించారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, రాజనర్సు, పాల సాయిరాం పాల్గొన్నారు.

ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణి వీడాలి



అక్కన్నపేటలో ఉరితాళ్లతో వినూత్నంగా నిరసన తెలుపుతున్న కార్మికులు

అక్కన్నపేట(హుస్నాబాద్): తమ న్యాయపరమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని నిరసిస్తూ ఆదివారం కార్మికులు ఉరితాళ్లతో నిరసన తెలిపారు. అక్కన్నపేట మండలం ఎంపీడీఓ కార్యాలయం ఎదుట చేపట్టిన పంచాయతీ కార్మికుల సమ్మె 18వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా కార్మికులు సమ్మె శిబిరంలో ఉరితాళ్లతో వినూత్నంగా నిరసన గళం విప్పారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఈ నెల 27వ తేదీన జిల్లా కలెక్టరేట్ కార్యాలయాన్ని ముట్టడి సమ్మెను మరింత ఉధృతంగా చేస్తామన్నారు. ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి వీడి మా డిమాండ్లను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో కార్మికులు వేముగంటి సాయిలు, రాజేశం, రాజు, ఓదెలు, లచ్చిరాం, రమేష్, సమ్మయ్య, కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

రాయపోలు(దుబ్బాక): కార్మికులు చేపట్టిన నిరసన 18వ రోజుకు చేరుకుంది. ఆదివారం దౌల్తాబాద్, రాయపోలు మండల కేంద్రాల్లో ఆయా మండలాలకు చెందిన గ్రామ పంచాయతీ కార్మికులు నిరసన దీక్షలు చేశారు. దౌల్తాబాద్‌లో కార్మికులు ఒంటికాలిపై నిలబడి నిరసన తెలిపారు. ప్రభుత్వం స్పందించి తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు.

ప్రతిపక్షాల కుట్రలను తిప్పికొట్టాలి

జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి



యువతకు లెర్నింగ్ లైసెన్సులు అందిస్తున్న ఎమ్మెల్యే ముత్తిరెడ్డి

చేర్యాల(సిద్దిపేట): ప్రాణత్యాగాలు చేసి సాధించుకున్న రాష్ట్రాన్ని ఆగం చేసేందుకు ప్రతిపక్షాలు చేస్తున్న కుట్రలను తిప్పికొట్టాలని ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి అన్నారు. ఆదివారం పట్టణ కేంద్రంలోని కల్యాణి గార్డెన్‌లో పట్టణ, చేర్యాల, కొమురవెల్లి మండలాలకు చెందిన 500మంది యువతీ, యువకులకు ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి లెర్నింగ్ లైసెన్సులు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాంగ్రెస్, బీజేపీలు ఒక్కటై రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకుంటున్నాయన్నారు. అధికారం కోసం బీజేపీ, కాంగ్రెస్‌లు రాజకీయ కుట్రలు చేస్తున్నాయని విమర్శించారు. ప్రతిపక్షాలు చేస్తున్న అసత్య ప్రచారాలు యువత నమ్మొద్దన్నారు. నేటి వరకు డ్రైవింగ్ లైసెన్సుల కోసం 11వేల దరఖాస్తులు వచ్చాయని, మరో 6 వేలు వచ్చే అవకాశం ఉందన్నారు. ఒక్కో లైసెన్సుకు రూ.2500ల చొప్పున సొంత ఖర్చులతో లైసెన్స్ ఇప్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉల్లంపల్లి కరుణాకర్, మున్సిపల్ చైర్‌పర్సన్ అంకుగారి స్వరూపారాణి, కొమురవెల్లి జెడ్పీటీసీ సిలువేరు సిద్దప్ప, మార్కెట్ చైర్మన్ సుంకరి మల్లేశం, మున్సిపల్ వైస్ చైర్మన్ నిమ్మ రాజీవ్‌కుమార్‌రెడ్డి, చేర్యాల, కొమురవెల్లి మండలాల అధ్యక్షులు అనంతుల మల్లేశం, గీస భిక్షపతి, వైస్ ఎంపీపీ నవీన్‌రెడ్డి, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు పెడతల ఎల్లారెడ్డి, నాలుగు మండలాల యూత్ ఇన్‌చార్జి శివగారి అంజయ్య, నాయకులు రాజేశ్, గిరిధర్, బుచ్చిరెడ్డి పాల్గొన్నారు.

అపూర్వ సమ్మేళనం



బెజ్జంకి(సిద్దిపేట): ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

బెజ్జంకి(సిద్దిపేట): బెజ్జంకి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1994-95లో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం బెజ్జంకి సత్యార్జున ఫంక్షన్ హాల్‌లో ఘనంగా అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. అప్పటి ఉపాధ్యాయులు, సిబ్బందిని సన్మానించారు. అనంతరం గత స్మృతులను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ గాజర్ల రమేశ్, విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



మద్దూరు: రేబర్తి పాఠశాలలో..

మద్దూరు(హుస్నాబాద్): మండలంలోని రేబర్తి గ్రామంలోని ఉన్నత పాఠశాలలో 1996-97 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. మండల కేంద్రంలోని తాజ్ గార్డెన్‌లో ఒకచోట కలుసుకొని జ్ఞాపకాలను నెమరుసుకున్నారు. చాలారోజుల తర్వాత కలిసిన స్నేహితులు ఒకరికొకరి యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారికి చదువు చెప్పిన గురువులను ఘనంగా సత్కరించారు.

సీఎం, మంత్రి చిత్రపటాలకు క్షీరాభిషేకం



సిద్దిపేటకమాన్: క్షీరాభిషేకం చేస్తున్న ప్రజాప్రతినిధులు, దివ్యాంగులు

సిద్దిపేటకమాన్: దివ్యాంగులకు అందించే పింఛన్ రూ.3016 నుంచి రూ.4016లకు రాష్ట్ర ప్రభుత్వం పెంచినందుకు సిద్దిపేట మున్సిపాలిటీ పరిధి 1వ వార్డు లింగారెడ్డిపల్లిలో సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావు చిత్రపటాలకు ఆదివారం క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, దివ్యాంగులు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

రాయపోలు(దుబ్బాక): దౌల్తాబాద్ మండలం ఇందుప్రియాల్‌లో మండల పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో మండల నాయకులు సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ వీరమ్మమల్లేషం, నాయకులు యాదగిరి, శ్రీనివాస్, షాదుల్లా, ముత్యంగౌడ్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పెన్షన్ పెంపుపై హర్షం

మిరుదొడ్డి(దుబ్బాక): రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగులకు పెన్షన్ పెంచడంపై ఉస్మానియా యూనివర్సిటీ పీహెచ్‌డీ స్కాలర్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు మొగుళ్ల ఐలయ్య హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం మిరుదొడ్డిలో ఆయన మాట్లాడుతూ.. దివ్యాంగులను దృష్టిలో పెట్టుకొని సీఎం కేసీఆర్ ప్రభుత్వం పెన్షన్ పెంచడం సంతోషకరమన్నారు. దివ్యాంగుల పక్షాన సీఎం కేసీఆర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. ఎలాంటి పైచికత్తు లేకుండా దివ్యాంగులకు రూ.10లక్షల బ్యాంక్ రుణాలను అందజేయాలన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

గజ్వేల్‌రూరల్: మణిపూర్ ఘటనకు కారకులైన నిందితులను కఠినంగా శిక్షించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎల్లయ్య, అంబేడ్కర్ సంఘం జిల్లా అధ్యక్షుడు చిప్పల యాదగిరి, మాల మహానాడు రాష్ట్ర నాయకుడు తుమ్మ శ్రీను, ఎమ్మార్పీఎస్ పొలిట్ బ్యూరో సభ్యులు మైస రాములు డిమాండ్ చేశారు. మణిపూర్‌లో జరిగిన ఘటనకు ప్రధాని మోదీ రాజీనామా చేయడంతో పాటు ఆ రాష్ట్ర సీఎం బీరెన్ సింగ్‌ను పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ ఆదివారం గజ్వేల్ పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద ప్లకార్డులతో నిరసన తెలిపారు. కార్యక్రమంలో నాయకులు స్వామి, రంగారెడ్డి, ఐలయ్య, వెంకటచారి, స్వామి, మహేందర్‌రెడ్డి, రాజు, మనోజ్, కుమార్, నర్సింలు, మహేశ్, శ్రీనివాస్, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.